RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com



# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8

సంచిక (Issue) : 306 వెల - రూ 5:00

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

బుధవారం 22, మార్చి 2023

పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

శ్రీ శోభకృత్ నామ సంవత్సర

## ఉగాది శుభాకాంక్షలు

నేడు ఉగాది సందర్భంగా పత్రిక కార్యాలయానికి సెలవు. కావున రేపు (గురువారం) సంచిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం

– ఎడిటర్




Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

# సుదీర్ఘ విచారణ

- ఇడి విచారణకు హాజరైన కవిత
- పగుల గొట్టారన్న ఫోన్లతో హాజరు
- ఇంటి నుంచి బయలుదేరే ముందు ప్లాస్టిక్ కవర్లలో ఫోన్లు
- మీడియాకు ప్రదర్శించిన పాతఫోన్లు
- విచారణకు సహకరించేందుకు సిద్ధం అంటూ ఇడికి లేఖ



**న్యూఢిల్లీ,మార్చి21(ప్రజామంటలు):** ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఈడీ విచారణకు హాజరయ్యారు. మంగళవారం ఉదయం 11 గంటల 30 సమయంలో ఈడీ ఆఫీసుకి చేరుకున్నారు. ఆమె వెంట భర్తతోపాటు.. ఇతర బీఆర్ఎస్ నేతలు ఇంటి నుంచి వచ్చారు. ఈడీ ఆఫీసులోకి అధికారులు మాత్రం ఒక్కరినే అనుమతించారు. విచారణకు హాజరుకావటం ఇది మూడో సారి. సోమవారం 10 గంటలకు పైగా ఆమెను విచారించారు అధికారులు. ఇవాళ మళ్లీ హాజరుకావాలని నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలోనే కవిత ఈడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. మరోవైపు ఈడీ ఆఫీస్ దగ్గర కేంద్ర బలగాలు భారీగా మోహరించాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. కవిత విచారణలో ఇవాళ కీలక పరిణామాలు ఉంటే అవకాశం ఉందనే ప్రచారం జోరుగా సాగుతుంది. ఈ క్రమంలోనే ఆమె తన వెంట గతంలో ఉపయోగించిన ఫోన్లను కూడా ఈడీ ఆఫీసుకు తీసుకురావటం విశేషం. ఈడీ విచారణకు హాజరుకావటానికి.. ఢిల్లీలోని తుగ్లక్ రోడ్డులోని ఇంటి నుంచి బయలుదేరే సమయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇంటి ఎదుట ఉన్న మీడియాకు తన మొబైల్ ఫోన్లను చూపించారు. రెండు కవర్లలో ఉన్న ఫోన్ల చూపించారు. ఎమ్మెల్సీ కవిత వ్యవహారం సంచలనంగా మారింది. కవిత ఫోన్లు పగలగొట్టారని.. చాలా ఫోన్లు ఉపయోగించారనే ఆరోపణలు వచ్చాయి. 10 ఫోన్లు ధ్వంసం చేశారనే ఆరోపణలు రావటంతో.. వాటికి సంబంధించి తన దగ్గర ఉన్న ఫోన్లను చూపించినట్లు తెలుస్తుంది. రెండు కవర్లలోని నాలుగు, ఐదు ఫోన్లను తనతోపాటు ఈడీ ఆఫీసుకు తీసుకెళ్లారు కవిత. ఆమెతోపాటు లాయర్లు కూడా వెంట ఉన్నారు. ఈడీ అధికారులకు తాను ఉపయోగించిన ఫోన్లను సమర్పించనున్నట్లు తెలుస్తుంది. విచారణకు హాజరయ్యే ముందు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్‌కు ఆమె లేఖ రాశారు. విచారణకు పూర్తి స్థాయిలో సహకరిస్తానని ఆ లేఖలో ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఇప్పటివరకు తాను ఉపయోగించిన మొబైల్ ఫోన్లను ఈడీకి సమర్పిస్తానని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈడీ విచారణకు వెళ్లే ముందు ఆమె వాడిన ఫోన్లను ఒక ప్లాస్టిక్ కవర్‌లో తీసుకుని వెళ్లారు. ఢిల్లీలోని సీఎం కేసీఆర్ అధికారిక నివాసం నుంచి ఈడీ కార్యాలయానికి బయల్దేరిన సమయంలో వాటిని ఎమ్మెల్సీ కవిత మీడియాకు చూపించారు. ఢిల్లీ లిక్కర్ కేసు నుంచి తప్పించుకునేందుకు ఈ ఫోన్లనే ఎమ్మెల్సీ కవిత ధ్వంసం చేశారని కొద్దిరోజులుగా ఈడీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించి కవిత ఈ నెల 11న తొలిసారి ఢిల్లీలో ఈడీ విచారణకు హాజరు అయ్యారు. ఆమెను తిరిగి ఈ నెల 16న మరోసారి రావాలని ఈడీ ఆదేశించింది. ఈడీ నోటీసులకు మిగతా... 2లో

### రెండోరోజూ

## కవిత విచారణ

- విచారణ ముగియడంతో బయటకు వచ్చిన కవిత
- ఇడి కార్యాలయం ముందు హైడ్రామా

**న్యూఢిల్లీ,మార్చి21(ప్రజామంటలు):** ఢిల్లీ లిక్కర్ స్కాంలో హైడ్రామా కొనసాగుతోంది. దాదాపు ఎనిమిదిన్నర గంటలపాటు రెండోరోజు కవితను విచారించారు. చివరకు నేటికి విచారణ ముగిసిందని ఇడి అధికారులు ప్రకటించారు. దీంతో ఆమె అరెస్ట్‌పై వచ్చిన ఊహాగానాలకు బ్రేక్ పడింది. మిగతా... 2లో



## వేట ముమ్మరం

- అమృత్‌పాల్ సింగ్ కోసం వేట ముమ్మరం
- ఖలిస్థాన్ అనుకూల ట్విటర్ ఖాతాల నిలిపివేత

**న్యూఢిల్లీ, మార్చి 21 (ప్రజామంటలు):** ఖలిస్థాన్ వాది అమృత్‌పాల్ సింగ్ కోసం వేట ముమ్మరంగా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఖలిస్థాన్ అనుకూలవాదుల ట్విటర్ ఖాతాలను భారత దేశంలో నిలిపివేశారు. కెనడాలోని న్యూ డెమొక్రాటిక్ పార్టీ నేత జగ్మీత్ సింగ్, కెనడియన్ పోయిట్ రూపీ కౌర్ మిగతా... 2లో



### పాకిస్తాన్ నుంచి

## బెదిరింపు కాల్స్

- గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్
- డీజీపీ అంజనీ కుమార్‌కు లేఖ

**హైదరాబాద్,మార్చి21(ప్రజామంటలు):** తనకు వచ్చిన బెదిరింపు కాల్స్‌పై గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే డీజీపీ అంజనీ కుమార్‌కు లేఖ రాశారు. తనకు ఎనిమిది నంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయని లేఖలో పేర్కొన్నారు. మిగతా... 2లో

### టీఎస్పీఎస్సీ పేపర్ లీక్‌పై

## హైకోర్టులో విచారణ

- సిట్ నివేదిక సమర్పించేందుకు 3 వారాల సమయం
- కేసును ఏప్రిల్ 11కు వాయిదా వేసిన హైకోర్టు




**హైదరాబాద్,మార్చి21(ప్రజామంటలు):** టీఎస్పీఎస్సీ క్వశ్చన్ పేపర్ లీక్ పై హైకోర్టు.. విచారణను ఏప్రిల్ 11కు వాయిదా వేసింది. పేపర్ లీకేజీ కేసుకు సంబంధించి హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. పేపర్ లీక్‌లో నిందితులను ఇప్పటికే సిట్ విచారిస్తోంది. ఈ క్రమంలో ఇవాళ జరిగిన హైకోర్టు విచారణలో ప్రభుత్వం తరుపు న్యాయవాది సిట్ నివేదికను సమర్పించేందుకు సమయం కోరారు. ఈ నేపథ్యంలో రిపోర్ట్ సమర్పించేందుకు ప్రభుత్వం తరుపు న్యాయవాది ఏజీ జీఎస్ ప్రసాద్‌కు హైకోర్టు 3వారాల సమయం ఇచ్చింది. తర్వాత సిట్ స్టేటస్ రిపోర్ట్ ను తమకు ఇవ్వాలని హైకోర్ట్ న్యాయవాదులను ఆదేశించింది. ఈ విచారణలో పిటిషనర్ తరుపు న్యాయవాది వివేక్ ధన్కా, ప్రభుత్వం తరుపు న్యాయవాది ఏజీ బీఎస్ ప్రసాద్ హైకోర్ట్ లో తమ వాదనని వినిపించారు. ఒకే మండలంలో 20 మందికి మంచి మార్కులు వచ్చాయని, దీనిపై అనుమానాలు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. టీఎస్ పీఎస్సీ.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీల కేసుపై హైకోర్టులో వాదనలు జరిగాయి. కాంగ్రెస్ నేత బల్మూరి మిగతా... 2లో



### ఇక మరింత వేగంగా

## వీసా సదుపాయాలు

**హైదరాబాద్‌లో అత్యాధునిక అమెరికన్ కాన్సులేట్**

- అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్

**హైదరాబాద్,మార్చి21(ప్రజామంటలు):** నానక్ రామ్‌గూడలో అత్యాధునికంగా నిర్మించిన అమెరికా కాన్సులేట్ కార్యకలాపాలు ప్రారంభించింది. 340 మిలియన్ డాలర్ల ఖర్చుతో దీనిని నిర్మించామని అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ చెప్పారు. ఈ కొత్త కాన్సులేట్ వల్ల ఇండియాతో తమ సంబంధాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. రెండుదేశాల సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి వీసా ఆఫీసర్ల సంఖ్యను, ఇతర స్టాఫ్‌ను పెంచుతామని చెప్పారు. పోయిన ఏడాది 18 వేలకు పైగా స్టూడెంట్ వీసాలను జారీ చేశామని అన్నారు. దాదాపు 14 సంవత్సరాలుగా హైదరాబాద్ బేగంపేటలోని పైగాప్యాలెస్‌లో వీసా సేవలు అందించిన అమెరికా కాన్సులేట్.. తన కార్యకలాపాలను సోమవారం నుంచి నానక్‌రామ్‌గూడలోని కొత్త కార్యాలయంలో ప్రారంభించింది. ఇది ఆసియాలో కెల్లా అతి పెద్ద అమెరికన్ కాన్సులేట్ మిగతా... 2లో

### ఆరోపణలపై సమాధానం

## ఇచ్చే హక్కు ఉంది

- లోక్‌సభలో మాట్లాడే హక్కును తొక్కి పెట్టొద్దు
- లోక్‌సభ స్పీకర్‌కు రాహుల్ లేఖ

**న్యూఢిల్లీ,మార్చి21(ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన ఆరోపణలపై సభలో



మాట్లాడేందుకు తనకు అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. ఈ మేరకు స్పీకర్‌కు ఆయన మంగళవారంనాడు లేఖ రాశారు. స్పీకర్‌కు రాహుల్ గాంధీ లేఖ రాయడం ఇది రెండోసారి. లోక్‌సభలో సీనియర్ మంత్రులు నాపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారం, అనుచితం. వారి ఆరోపణలపై స్పందించేందుకు అనుమతించాలంటూ ఈనెల 17న కూడా నేను మీకు లేఖ రాశానని మిగతా... 2లో



### ఆదానీ వ్యవహారంపై

## పట్టువీడని విపక్షం

- పార్లమెంట్ భవనం ఎక్కి నిరసనల హోరు
- ఉభయ సభల్లో జెపిసికి సభ్యుల డిమాండ్
- గందరగోళం మధ్య గురువారానికి పార్లమెంట్ వాయిదా

**న్యూఢిల్లీ,మార్చి21(ప్రజామంటలు):** అదానీ విషయంపై పార్లమెంట్‌లో విపక్షాలు పట్టు వీడటం లేదు. అదానీ సంక్షోభంపై జేపీసీ వేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో ఉభయ సభల్లో నిరసనలు తెలిపే సరికి.. స్పీకర్లు వాయిదా వేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా పార్లమెంట్ ఉభయసభలు మధ్యాహ్నం రెండు గంటలసేపు వాయిదా పడ్డాయి. అదానీ వ్యవహారంపై జేపీసీతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ విపక్ష ఎంపీలు పార్లమెంట్ ఫస్ట్ ఫ్లోర్ ఎక్కి నిరసనలు తెలిపారు. బ్యానర్లు పట్టుకొని నినాదాలు చేశారు. తృణముల్ ఎంపీలు కూడా ప్రత్యేక ఆందోళనలు చేపట్టారు. అదానీ అంశంపై మోడీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. అదానీపై విచారణ చేపట్టకుండా.. మోడీ ప్రభుత్వం ఆయనకు సహకరిస్తుందని ఆరోపించారు. తృణముల్ కాంగ్రెస్ పార్టీతో పాటు.. కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ, శివసేన, జేడీయూ, జేఎంఎం, ఐయూఎంఎల్, మిగతా... 2లో

## ప్రజానాడి






### బండి సంజయ్‌కు

## సిట్ నోటీసులు

- 24న సిట్ ఎదుట హాజరు కావాలని ఆదేశాలు

**హైదరాబాద్,మార్చి21(ప్రజామంటలు):** పేపర్ లీకేజీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన ఆరోపణలపై సిట్ ఆయనకు నోటీసులు జారీ చేసింది. పేపర్ లీకేజీపై చేసిన ఆరోపణలపై ఆధారాలు ఇవ్వాలని సిట్ పేర్కొంది. మార్చి 24వ తేదీన సిట్ ఎదుట హాజరవ్వాలని బండి సంజయ్‌కు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు అధికారులు మిగతా... 2లో

### కేసులతో బిఆర్ఎస్

## గొంతు నొక్కలేరు

- దమ్ముంటే విదేశాల్లో ఉన్న దొంగలను పట్టుకోండి
- ఆడపడుచు కవితను కేసులతో వేధిస్తే ఊరుకోం
- బిజెపికి మంత్రి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక

**న్యూఢిల్లీ,మార్చి21(ప్రజామంటలు):** బీఆర్ఎస్ నేతలను గొంతు నొక్కాలని చూస్తే జరిగే పని కాదు. ఉద్యమాల గడ్డ తెలంగాణ. కేసులకు మిగతా... 2లో






### మహిళలు చేసే

## వ్యాపారమేనా ఇది?

- దారిన పోయే దానయ్య ఫిర్యాదుతో నాపై చర్యలు
- బిడ్డ తతప్పు చేస్తే ఎందుకు చర్య తీసుకోలేదు..
- కవిత లిక్కర్ స్కామ్‌పై ఈటెల రాజేందర్ విమర్శలు

**హన్మకొండ,మార్చి21(ప్రజామంటలు):** ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత ఈడి విచారణ విషయంలో సీఎం కేసీఆర్ తీరును బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ తప్పుబట్టారు. దారిలో పోయే మిగతా... 2లో

# ఆదానీ వ్యవహారంపై పట్టువీడని విపక్షం

**(మొదటి పేజీ తరువాయి)**
ఆప్, ఎండీఎంకే పార్టీలన్నీ కలిసి ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గేతో భేటీ అయ్యారు. ఈ క్రమంలో పార్లమెంట్‌లో రభస కొనసాగుతూనే ఉన్నది. రెండో విడత మావేశాలు ప్రారంభమైన దాదాపు 10 రోజులు కావస్తున్నా ఉభయసభల్లో వాయిదాల పర్వం మాత్రం ఆగడంలేదు. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని విపక్షాలు పట్టుపడుతుండగా.. లండన్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చేసిన ప్రసంగంపై రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని అధికారపక్ష సభ్యులు ఎదురుదాడి చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు ఉభయసభలు ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు అదానీ అంశంపై జేపీసీ కోసం పట్టుబట్టారు. ఆ వెంటనే అధికారపక్షం ఎంపీలు కూడా రోజులాగే రాహుల్‌గాంధీ అంశాన్ని లేవనెత్తారు. రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలన్న డిమాండ్ తో ఎదురుదాడికి దిగారు. దాంతో అటు రాజ్యసభలో, ఇటు లోక్‌సభలో గందరగోళం నెలకొంది. ఇరువర్గాల సభ్యులు పోటాపోటీ నినాదాలతో సభలను హోరెత్తించారు. లోక్‌సభలో స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఆందోళన చేస్తున్న సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోలేదు. దాంతో ముందుగా ఉభయసభలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదాపడ్డాయి. ఒంటిగంటకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ వేర్వేరుగా ఆల్‌పార్టీ మీటింగ్ ఏర్పాటు చేసి మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. మధ్యాహ్నం రెండు గంటలకు ఉభయసభలు తిరిగి ప్రారంభమైనా సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. దాంతో ఉభయ సభలు గురువారానికి వాయిదా పడ్డాయి.

## ఆరోపణలపై సమాధానం ఇచ్చే హక్కు ఉంది

(మొదటి పేజీ తరువాయి)
స్పీకర్‌కు రాసిన రెండో లేఖలో రాహుల్ పేర్కొన్నారు. మరోసారి తాను ఇదే విజ్ఞప్తి చేస్తున్నానని, పార్లమెంట్ సంప్రదాయాల ప్రకారం అనుమతి కోరుతున్నానని అన్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై రాజ్యాంగంలోని 357వ రూల్ ప్రకారం పార్లమెంటులో స్పందించేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను రాహుల్ కోరారు. లోక్‌సభలో సభ్యుడు ఎవరైనా వ్యక్తిగత వివరణ ఇచ్చేందుకు 357వ రూల్ అనుమతిస్తుందని గుర్తుచేశారు. బీజేపీ హయాంలోని కేంద్రం ఇటు పార్లమెంటులోనూ, అటు పార్లమెంటు వెలుపల తన పరువుకు నష్టం కలిగించేలా ఆరోపణలు చేస్తోందని ఆ లేఖలో రాహుల్ పేర్కొన్నారు. వీటికి 357వ రూల్ ప్రకారం సమాధానం చెప్పే హక్కు తనకు కల్పించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ రెండో విడత సమావేశాలు మార్చి 13న మొదలైనప్పటికీ ఇంతవరకూ సభాకార్యక్రమాల్లో నెలకొన్న ప్రతిష్టంభన తొలగలేదు. రాహుల్ గాంధీ లండన్‌లో చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని అధికార పక్షం సభ్యులు డిమాండ్ చేస్తుండగా, అదానీ అంశంపై జేపీసీ దర్యాప్తు జరిపించాలనే డిమాండ్‌పై విపక్షాలు పట్టువీడటం లేదు. ఏప్రిల్ 6వ తేదీతో బడ్జెట్ సమావేశాలు ముగుస్తాయి.

## ఎవడు చస్తే నాకేంటనే ధోరణి

### సీఎం కేసీఆర్‌పై షర్మిల విమర్శలు

**హైదరాబాద్,మార్చి21(ప్రజామంటలు):** ఎవడు చస్తే నాకేంటని వెంట నడిచినోళ్లను.. వెన్నంటి ఉన్నోళ్లను వెన్ను పోటు పొడిచావ్' అంటూ సీఎం కేసీఆర్ పై వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శలు గుప్పించారు. కార్యకర్తలకు బహిరంగలేఖ రాయడంపై ముఖ్యమంత్రిపై ట్విట్టర్ వేదికగా వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎవడు చస్తే నాకేంటని వెంట



నడిచినోళ్లను, వెన్నంటి ఉన్నోళ్లను వెన్ను పోటు పొడిచావ్. సకల జనులను మోసం చేశావ్.. కానీ ఇప్పుడు నీ పీఠం కదులుతుందని లిక్కర్ మరకల్లో బిడ్డ జైలుకు పోతుందని.. 'పేపర్ లీకేజీ వ్యవహారం అధికార శాపం అయ్యేసరికి ఎన్నికలు వస్తున్నాయని ఎత్తులు వేస్తున్నావా కేసీఆర్. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు..నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు..ఉద్యమ కారులకు అన్యాయం జరిగినప్పుడు..మా పార్టీ సర్పంచ్ లు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పుడు ఒక్క నాడైనా ఆత్మహత్యలు చేసుకోకండి అని ఒక్కరికైనా లెటర్ రాసావా?' అని షర్మిల ప్రశ్నించారు.'బిడ్డ జైలుకు పోయే సమయం వచ్చే సరికి కేసీఆర్ కు కార్యకర్తలు గుర్తుకు వచ్చారు. కార్యకర్తల బలం గుర్తుకు వచ్చింది. తెలంగాణ ఉద్యమం గుర్తుకు వచ్చింది. ఆత్మీయ సందేశం అని.. మొసలి కన్నీరు కారుస్తూ ఓపెన్ లెటర్లు రాస్తున్నారు. నువ్వు ఎన్ని లెటర్లు రాసినా.. ఎన్ని కుప్పిగంతులు వేసినా.. నీ పాపం పండింది. రేపు ఎన్నికల్లో నీ పాపానికి పరిహారం చెల్లించుకొనుడే.. నువ్వు నీ ఫ్యామిలీ జైలుకు పోవుడే' అని షర్మిల జోశ్యం చెప్పారు.

## పేపర్ లీకేజ్ కేసును నీరుగార్చే కుట్ర

### బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్,మార్చి21(ప్రజామంటలు):** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పెద్ద స్కాం.. దీన్ని చిన్న విషయంగా మార్చే కుట్ర కనపడుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం పేపర్ లీకేజీ వ్యవహారంపై హైదరాబాద్ లో యువజన సమితి ఆధ్వర్యంలో నిరుద్యోగుల గోస పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ప్రశ్నించే వాళ్లని బీఆర్ఎస్ మంత్రులు బెదిరిస్తున్నారు. ఇలాంటి అన్ని సమస్యలపై కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని వెల్లడించారు ప్రవీణ్ కుమార్. ప్రత్యేక కార్యాచరణతో అందరం ప్రజల్లోకి వెళ్లాలన్నారు.రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పోరాడాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్ దగ్గర వేల కోట్ల రూపాయలు ఉన్నాయి.. ప్రత్యేక విమానాల్లో పోయి కవితను కాపాడుకునేంత దమ్ము వారికి ఉందని ఆరోపించారు. ప్రభుత్వం చెప్పినట్లు సిట్ వింటుంది. పేపర్ లీక్ కేసును సిట్ కాదు సీబీఐతోనే విచారించాలని డిమాండ్ చేశారు.

# ఇక మరింత వేగంగా వీసా సదుపాయాలు

**(మొదటి పేజీ తరువాయి)**
కార్యాలయం. ఇందులో లాంఛనంగా అమెరికా పతాకాన్ని ఆవిష్కరించి సేవలకు శ్రీకారం చుట్టారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంలో నూతన అధ్యాయం ప్రారంభమైందని పేర్కొన్నారు. గడిచిన 14 ఏళ్ల కాలంలో 16 లక్షల వీసాలు జారీ చేశామని.. కొత్త కాన్సులేట్ కార్యాలయం నుంచి మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆమెతెలిపారు. పాత కార్యాలయంలో 20 వీసా ఇంటర్వ్యూ విండోలు ఉండేవి. అయితే, ఇటీవలికాలంలో అమెరికా వీసాల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య.. వీసాల కోసం వెయిటింగ్ లిస్ట్ భారీగా పెరిగిపోవడంతో.. కార్యాలయ మార్పు నిర్ణయానికి వచ్చింది. కొత్త భవనంలో వీసా ఇంటర్వ్యూ విండోల సంఖ్యను 54కు పెంచింది. కార్యాలయ మార్పులో భాగంగా మార్చి 15 మధ్యాహ్నం 12 గంటల నుంచి మార్చి 20న ఉదయం 8.30 గంటల వరకు కాన్సులేట్ సేవలు నిలిచిపోయాయి. కొత్త భవనం ప్రారంభం కావడంతో సోమవారం నుంచి మళ్లీ వీసా సేవలు ప్రారంభం అయినట్లు కాన్సులేట్ వర్గాలు తెలిపాయి. ఇందులో అదనపు విండోలు ఏర్పాటు చేయడంతో వీసాల కోసం వేచి ఉండే అవస్థ చాలావరకు తగ్గుతుందని విద్యార్థులు, ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఈ కొత్త కాన్సులేట్‌లో.. మరింత మంది సిబ్బందిని నియమించి వేగంగా, గతంలో కంటే ఎక్కువగా వీసాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జెన్నిఫర్ తెలిపారు. 12.2 ఎకరాల విస్తీర్ణంలో.. దాదాపు రూ.2,429 కోట్ల వ్యయంతో, అత్యంత అధునాతన సౌకర్యాలతో ఈ కాన్సులేట్ భవనాన్ని నిర్మించారు. ఇక్కడినుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని అమెరికన్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ తెలిపారు. కొత్త కార్యాలయాన్ని పూర్తి పర్యావరణహితంగా నిర్మించామని.. వాననీటిని ఒడిసిపట్టి, శుద్ధి చేసి తిరిగి వినియోగించుకునేలా చర్యలు చేపట్టామని, కాన్సులేట్ ప్రాంగణంలోని సహజ శిలల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఆమె వివరించారు.

హైదరాబాద్‌లో యుఎస్ కాన్సులేట్ నూతన కార్యాలయం నానక్‌రామ్‌గూడ సమీపంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వద్ద సర్వే నంబర్ 115/1 వద్ద ఉంది. వీసా దరఖాస్తుదారులందరూ ఇంటర్వ్యూల కోసం ఈ నూతన కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇతర వీసా సేవలు అంటే బయోమెట్రిక్ అపాయింట్‌మెంట్స్, (డ్రాప్‌బాక్స్ అపాయింట్‌మెంట్స్ (ఇంటర్వ్యూ మినహాయింపు), పాస్‌పోర్ట్ పికప్ సేవలు ఎప్పటిలాగానే మాదాపూర్‌లోని హైటెక్ మెట్రో స్టేషన్ లోయర్ కాన్‌కోర్స్ వద్దనున్న వీసా అప్లికేషన్ కేంద్రంలో కొనసాగుతాయి.

# టీఎస్పీఎస్సీ పేపర్ లీక్‌పై హైకోర్టులో విచారణ

**(మొదటి పేజీ తరువాయి)**
వెంకట్ దాఖలు చేసిన పిటీషన్‌పై.. మార్చి 21వ తేదీ మంగళ వారం వాదనలు జరిగాయి. కాంగ్రెస్ తరపున లాయర్ వివేక్ ధన్కా వాదనలు వినిపించారు. పేపర్ లీకేజీ కేసు సీబీఐకి ఇవ్వాలని కోరారాయన. లక్షల మంది విద్యార్థుల జీవితాలకు సంబంధించిన అంశం అని.. సిట్ దర్యాప్తు కంటే సీబీఐ విచారణతోనే అసలు నిందితులు బయటకు వస్తారని వాదించారాయన. కేసు తీవ్రత దృష్ట్యా సీబీఐతో విచారణ చేయించినట్లయితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని లాయర్ వివేక్ ధన్కా కోర్టు దృష్టికి తెచ్చారు. కాంగ్రెస్ వాదనలకు ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ కౌంటర్ వాదనలు వినిపించారు. ఇప్పటికే కేసు విచారణ సిట్ ఆధ్వర్యంలో జరుగుతుందని.. ఎంతో పారదర్శకంగా సాగుతుందని కోర్టుకు దృష్టికి తెచ్చారు. రెండు వర్గాల వాదనలు విన్న హైకోర్టు.. స్టేటస్ రిపోర్ట్ వివరాలను సమర్పించాలని ఆదేశించింది. విచారణ ఏ దశలో ఉంది.. ఇప్పటి వరకు చేసిన విచారణ ఏంటీ అనే వివరాలను కోర్టుకు అందించాలని ఆదేశించింది. అయితే సిట్ నివేదిక సమర్పించేందుకు ప్రభుత్వం తరఫు న్యాయవాది సమయాన్ని కోరారు.

దీనికి హైకోర్టు మూడు వారాల పాటు సమయాన్ని ఇచ్చింది. పేపర్ లీకేజ్ కేసులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 11వ తేదీకి వాయిదా వేసింది హైకోర్టు.

# పాకిస్తాన్ నుంచి బెదిరింపు కాల్స్

**(మొదటి పేజీ తరువాయి)**
పాకిస్తాన్ నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, అనేక సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జై శ్రీరామ్ అన్న ప్రతిసారీ తనపై ఎఫ్ఐఆర్ బుక్ చేసే పోలీసులు.. ఇప్పుడు ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. గన్ లైసెన్స్ కోసం ఇప్పటికే చాలాసార్లు అభ్యర్థన పెట్టుకున్నానని.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని అన్నారు. అయితే తనపై కేసులు ఉన్నాయని గన్ లైసెన్స్ ఇవ్వడం లేదన్నారు. కేసులు ఉన్నా కూడా గన్ లైసెన్స్ పొందిన వ్యక్తులు ఉన్నారని.. తన ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ గన్ లైసెన్స్ ఇవ్వకపోవడం దారుణమని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు డీజీపీ అంజనీ కుమార్ కు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ రాశారు. తనకు 8 నెంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని లైసెన్స్ గన్ ఇవ్వాలని డీజీపీని కోరారు.

రక్షణ కోసం పదేపదే కోరుతున్నా స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. తనపై కేసులున్నాయని అభ్యంతరం వ్యక్తం చేస్తున్న పోలీస్ శాఖ.. కేసులున్న ఎవ్వరికీ లైసెన్స్ ఇవ్వలేదా అని ప్రశ్నించారు. తనకు పాకిస్థాన్ నుంచి కూడా బెదిరింపు కాల్స్ వస్తున్నాయని రాజాసింగ్ తన లేఖలో తెలిపారు.

# రెండోరోజూ కవిత విచారణ

**(మొదటి పేజీ తరువాయి)**
ఆమె ఇడి కార్యాలయం నుంచి బయటకు వచ్చి నేరుగా నివాసానికి వెళ్లారు అంతకుముందు విచారణ ఎదుర్కొంటున్న కవిత లీగల్ టీంకు.. ఈడీ ఆఫీసు నుంచి పిలుపు వెళ్లింది. అధికారుల నుంచి ఫోన్ రావటంతో.. హుటాహుటిన ఆఫీసుకు చేరుకున్నారు అడ్వకేట్ సోమా భరత్. ఆయనతో ఇతర అడ్వకేట్లు కూడా ఆఫీసుకు వచ్చారు. అయితే సోమ భరత్ మాత్రమే ఆఫీసులోకి వెళ్లారు. సాయంత్రం 7 గంటల సమయంలో ఆయన్ను పిలవాల్సిన అవసరం ఏంటీ అనేది ఆసక్తిగా మారింది. మూడోసారి విచారణకు.. ఉదయం హాజరైన ఎమ్మెల్సీ కవితను.. ఎనిమిది గంటలుగా విచారించారు. నేటి విచారణకు ఆమె తన పాత ఫోన్లను కూడా తీసుకెళ్లారు. మరోవైపు ఈడీ ఆఫీస్ పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు భద్రతా సిబ్బంది. చుట్టుపక్కల ఉన్న అందర్నీ అక్కడి నుంచి పంపించి వేసారు. మహిళా పోలీసులు సైతం భారీగా ఉన్నారు.

కేంద్ర బలగాలు సెక్యూరిటీ చూస్తున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విచారణ జరుగుతున్న ఢిల్లీలోని ఈడీ ఆఫీస్ దగ్గర మహిళా పోలీసులు, కేంద్ర బలగాలు మోహరించటం హై టెన్షన్ పెడుతుంది. మంగళవారం ఉదయం 11 గంటల 30 నిమిషాలకు ఆఫీసులోకి వెళ్లిన కవిత.. తన వెంట ఫోన్లు కూడా తీసుకెళ్లారు. ఫోన్ల చుట్టూ విచారణ జరుగుతున్నట్లు స్పష్టం అవుతున్నా.. సాయంత్రం 6 గంటల తర్వాత కూడా విచారణ కొనసాగటంతో ఉత్కంఠ నెలకొంది. ఇదే సమయంలో ఆఫీస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈడీ విచారణకు కవిత హాజరుకావటం ఇది మూడో సారి. మార్చి 20వ తేదీ రెండోసారి విచారణకు హాజరయిన సమయంలో 10 గంటల సమయం విచారించారు. హైటెన్షన్ తర్వాత బయటకు వచ్చారు. రెండోసారి విచారణ ఎదుర్కొన్న తర్వాత రోజే.. మళ్లీ రావాలని ఈడీ అధికారులు ఆదేశించటం.. సుదీర్ఘంగా విచారణ కొనసాగటం.. ఆఫీస్ ఎదుట మహిళా పోలీసులు భారీ సంఖ్యలో ఉండటం.. కేంద్ర బలగాలు మోహరించటం ఆసక్తి రేపింది.

రెండో రోజు విచారణ సందర్భంగా ఉన్న హడావిడి కంటే.. మూడోసారి విచారణ కూల్ గా సాగుతుంది. ఆఫీస్ బయట బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతల హంగామా పెద్దగా కనిపించటం లేదు. అయినా కూడా విచారణ సుదీర్ఘంగా కొనసాగినా..చివరకు కవిత ఇడి ఆఫీస్ నుంచి బయటకు వచ్చారు.

# సుదీర్ఘ విచారణ

**(మొదటి పేజీ తరువాయి)**
సంబంధించి తాను సుప్రీం కోర్టులో పిటిషన్ వేశానని, అది ఈ నెల 24న విచారణకు రానున్నదని, సుప్రీం తీర్పునకు అనుగుణంగా నడుచుకుంటానని ఆమె ఈడీకి తన ప్రతినిధి ద్వారా చెప్పారు. అదే సమయంలో ఈడీ అడిగిన అన్ని పత్రాలను సమర్పించారు. అనంతరం సోమవారం ఆమెను విచారణకు హాజరు కావాలని ఈడీ నోటీసులివ్వడంతో హాజరయ్యారు. విచారణ అనంతరం ఈడీ అధికారులు ఎమ్మెల్సీ కవితను తిరిగి మంగళవారం విచారణకు హాజరుకావాలని సూచించారు. ఈ నేపథ్యంలో మూడోసారి ఆమె ఈడీ ముందు హాజరయ్యారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఈడీ కార్యాలయానికి చేరుకున్న కవిత నుంచి రాత్రి 9.30 వరకు అధికారులు వివరాలు సేకరించారు. అయితే కవిత ఈడీ ఆఫీసుకు వచ్చిన తర్వాత గంటవరకు దర్యాప్తు అధికారులు ఆమెను ప్రశ్నించలేదని తెలిసింది. ఇతర నిందితుల సమక్షంలో ముఖాముఖి ప్రశ్నలు అడుగుతున్నట్టు ఈడీ అధికారులు బయటకు లీకులు వదిలినప్పటికీ.. కవితను మాత్రం ఇంతవరకు ఎవరితోనూ కన్‌ఫ్రంటేషన్ చేయలేదు. ఆమెను విడిగానే విచారించారు. అయితే మొత్తం 11 గంటల్లో కేవలం 14 ప్రశ్నలు మాత్రమే ఈడీ బృందం కవితను అడిగినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఎక్కువ సమయం ఖాళీగా కూర్చోబెట్టినట్టు అర్థమవుతున్నది. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, చేయనని సోమవారం ఈడీ దర్యాప్తులో కవిత స్పష్టంచేశారు. కేవలం రాజకీయ కుట్రలో భాగంగానే తనను దురుద్దేశంతో విచారిస్తున్నారని ఆమె ఈడీ అధికారులతో కుండబద్ధలు కొట్టారు. తాను పూర్తిస్థాయిలో విచారణకు సహకరిస్తున్నప్పటికీ.. సహాయ నిరాకరణగా చిత్రీకరించేందుకు ఈడీ కుట్ర పన్నుతున్నదని ఆమె ఆరోపించారు. విచారణలో పారదర్శకత లోపించిందని, రాజకీయ వేధింపుల్లో భాగంగానే తనను విచారిస్తున్నట్లు తెలుస్తున్నదని కవిత నిల దీయగా.. ఈడీ అధికారులు మౌనంగా ఉండిపోయారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఏ అక్రమాల్లోనూ తన పాత్ర లేకపోయినా కల్పిత కథలతో తనపై బురదచల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారని సమాచారం. తమ విశ్వసనీయత తమకు ఉన్నదని కవిత స్పష్టంచేశారు. ఈడీ విచారణలో పారదర్శకత లేదని పలుమార్లు తేల్చిచెప్పిన కవిత.. అధికారపార్టీకి కొమ్ముకాస్తున్నారని విచారణ అధికారుల మొహం మీదే చెప్పినట్టు రాజకీయవర్గాలు తెలిపాయి.

# మండుతున్న బంగారం ధరలు

## 60వేల మార్కును దాటిన పది గ్రాములు

**న్యూఢిల్లీ,మార్చి21(ప్రజామంటలు):** బంగారం ధరలు మండుటెండల్లా మండుతున్నాయి. బంగారం ధరలు మరోసారి భగ్గుమంటున్నాయి.. ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నాయి.. సామాన్యుడికి అందనతంగా దేశంలో పసిడి ధరకు రెక్కలొచ్చాయి. గడిచిన కొంతకాలంగా బంగారం, వెండి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. రెండరోజులుగా స్థిరంగా ఉన్న బంగారం ధరలు గత 24 గంటల్లో భారీగా పెరిగాయి. దీంతో మార్చి 21న 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.59,780కి చేరుకుంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ. 54,800గా నిలిచింది. 10 రోజుల క్రితం వరకు పసిడి ధరలు ఇంచుమించుగా రూ.55,200 పలికాయి. ఆ తర్వాత స్వల్పకాలంలోనే ఏకంగా 8 శాతం మేర ర్యాలీ కనిపించింది. కీలక ఆర్థిక వ్యవస్థల్లో బ్యాంకింగ్ సంక్షోభం కొనసాగుతుండడం, మరిన్ని దేశాల్లో సైతం వెలుగుచూడొచ్చన్న సంకేతాల నేపథ్యంలో పసిడి ధరలు మరింత పెరగొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్.. ఇప్పుడు



యూరప్‌లో క్రెడిట్ సూయిస్ బ్యాంక్ సంక్షోభాలు బంగారం ధరలకు రెక్కలొచ్చేలా చేశాయని అంటున్నారు. పసిడి ధరలు దేశీయంగా రూ.60 వేల మార్క్‌ను తాకడం అంతగా ఆశ్చర్యం కలిగించలేదని ఆయన చెప్పారు. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 1980 డాలర్లు పలుకుతోందన్నారు. బ్యాంకింగ్ సంక్షోభం భయాల నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ అత్యవసర లిక్విడిటీ చర్యలు, ఇతర ప్రధాన కేంద్ర బ్యాంకులు సైతం కీలక చర్యలకు సిద్ధమవుతుండడం బంగారం ధరల పెరుగుదలకు కారణాలని పేర్కొన్నారు. సోమవారం 24 క్యారెట్ గోల్డ్ రూ.58,220 ఉండగా ఒక్కరోజులోనే 15 వందల రూపాయలు పెరిగింది. నిన్న 22 క్యారెట్ గోల్డ్ కు రూ. 53,330 ఉండగా ఇవాళ రూ.54,800 వద్ద నిలిచింది. సోమవారం దేశ రాజధాని ఢిల్లీ మార్కెట్‌లో ఏకంగా రూ.1400 మేర పెరిగి రూ.60,100కు చేరింది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూ.58,700 వద్ద ముగిసిన పసిడి ధర సోమవారం భారీగా పెరిగింది. ఇక ఎంసీఎక్స్‌పై కూడా తొలిసారి రూ.60 వేల మార్క్‌ను తాకింది.

అమెరికా, యూరప్‌లలో బ్యాంకింగ్ సంక్షోభం నేపథ్యంలో పెట్టుబడులకు సురక్షితమైన బంగారంపై ఇన్వెస్ట్‌మెంట్‌కు ట్రేడర్లు మొగ్గుచూపుతుండడం ధరలకు రెక్కలొచ్చేందుకు కారణమవుతోంది. మరోవైపు ద్రవ్యోల్బణం పెరుగుదల, వడ్డీ రేట్లు పెంపు వంటి పరిణామాలు కూడా బంగారం భగభగలకు కారణమవుతున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. రూపాయి విలువ పతనం కూడా ఇందుకు ఆజ్యం పోస్తోందని చెబుతున్నారు. మరోవైపు వెండి ధర సోమవారం భారీగా పెరిగింది. ఒక కేజీపై రూ.1860 మేర పెరిగి రూ.69,340కు చేరింది.

## బండి సంజయ్‌కు
# సిట్ నోటీసులు

**(మొదటి పేజీ తరువాయి)**
ఒకే ఊర్లో ఎక్కువ మందికి ర్యాంకులు వచ్చాయని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల క్రమంలో ఆయనకు సిట్ నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి సైతం సిట్ నోటీసులు జారీ చేసింది. 'పేపర్ లీకేజీ కుట్ర వెనుక నా పాత్ర ఉందని కేసీఆర్ కుమారుడు మంత్రి కేటీఆర్ ఆరోపణలు చేశారు. నాపై ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని కేసీఆర్ కొడుకుకు నోటీసులు జారీ చేసే దమ్ము సిట్‌కు ఉందా..?' అని ప్రశ్నించారు. కుట్రకు కారకులైన వారిని వదిలేసి ప్రతిపక్షాలకు నోటీసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. సిట్ నోటీసులకు విచారణకు భయపడే ప్రసక్తే లేదని చెప్పారు.

## కేసులతో బిఆర్ఎస్
# గొంతు నొక్కలేరు

**(మొదటి పేజీ తరువాయి)**
భయపడేది లేదు అని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ తేల్చిచెప్పారు. కేంద్రానికి చేతనైతే విదేశాల్లో దాక్కున్న దొంగలను తీసుకురావాలన్నారు. బిఆర్ఎస్ నేతలను కేసులతో బెదిరించాలనుకోవడం మీ తరం కాదన్నారు. కానీ ఆడబిడ్డలను గంటల తరబడి ఈడీ ఆఫీసులో కూర్చోబెట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్, కేసీఆర్‌ను ఎదుర్కోలేక తప్పుడు కేసులతో భయపెట్టాలని చూస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. న్యూఢిల్లీలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత సెల్‌ఫోన్లు ధ్వంసం చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎలా చెబుతారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఫోన్లు ధ్వంసం చేశారని కిషన్ రెడ్డి ఏ ఆధారాలతో చెప్పారు. మార్చిలో విచారణకు పిలిచారు.. కానీ నవంబర్‌లోనే ఫోన్లు ధ్వంసం చేశారని కిషన్ రెడ్డి ఆరోపించారు. కానీ ఇవాళ కవిత తన మొబైల్స్‌ను ఈడీకి అప్పగించారు. తప్పు చేయలేదు కాబట్టి ఎమ్మెల్సీ కవిత భయపడటం లేదన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా బీజేపీ నేతలు అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఒక మహిళ గోప్యత, ప్రతిష్ఠ దెబ్బతినేలా బీజేపీ నేతలు మాట్లాడారు. కొన్ని మీడియా సంస్థలు గాలి వార్తలతో పైశాచిక ఆనందం పొందాయి. కిషన్ రెడ్డి ఇప్పుడు తలకాయ ఎక్కడ పెట్టుకుంటారు. ఎమ్మెల్సీ కవితకు కిషన్ రెడ్డి క్షమాపణ చెప్పాలి అని మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. వేల కోట్లు ఎగవేసిన నీరవ్ మోదీ, లలిత్ మోదీని కేంద్రం ఎందుకు వదిలేసింది అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. నీరవ్ మోదీ, లలిత్ మోదీ, విజయ్ మాల్యా ఎక్కడున్నారు..? దేశ సంపదను దోచుకుని లండన్ పారిపోయిన వారిని ఎందుకు రప్పించట్లేదు. లక్షల కోట్లు కొల్లగొట్టిన కేసులను వదిలేసి రూ. 100 కోట్ల స్కామ్ అంటూ మహిళపై కేసులు పెడుతున్నారు. మహిళ అని చూడకుండా గంటల కొద్దీ కూర్చోబెట్టి వేధిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే స్కామ్ అని ఎలా అంటారు అని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ అధికారం శాశ్వతం కాదు. బీజేపీలో చేరగానే గంగానదిలో స్నానం చేసినట్లు పాపాలు పోతాయని అనుకుంటున్నారు. బీజేపీలో చేరిన అక్రమార్కులపై కేసుల్లేవు.. విచారణలు లేవు అని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## మహిళలు చేసే
# వ్యాపారమేనా ఇది?

(మొదటి పేజీ తరువాయి)
దానయ్య ఫిర్యాదు చేస్తే నన్ను తీసివేసావ్.. కనీసం విచారణ చేశావా? చేయకుండానే తీసి వేస్తివి.. హుజురాబాద్ వస్తివి..దెబ్బలు తింటివి..ఈటల రాజేందర్ తప్పు చేశారా? కేసీఆర్ చేశారా అని అడిగితే ప్రజలు తేల్చి చెప్పారన్నారు. మీమీద ఆరోపణలు వస్తే మాత్రం విచారణ ఎదుర్కోవడానికి ఎందుకు వెనక్కు పోతున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ ప్రశ్నించారు.ఇకపోతే లికక్ర్ స్కామ్‌పై మాట్లాడుతూ ఇది మహిళలు చేసే బిజినెస్సేనా..? లిక్కర్ స్కాంలో ఆడవాళ్లు ఉంటారా..? అని గ్రామాల్లో మహిళలు అడుగుతున్నారు.. టూ బ్యాడ్.. ఇది పరాకాష్ట. బిజినెస్ చేసుకోవడానికి ఇదే దొరికిందా..? మహిళగా ఇది ఒక కళంకం అని ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత ఈడీ విచారణ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ ఘాటుగా స్పందించారు. నిజంగా ఎమ్మెల్సీ కవిత తప్పు చేయకుంటే చట్టానికి సహకరించి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ కవిత ఈడీ విచారణ రాజకీయ కుట్ర అయితే అది ఈ రాష్ట్రంలోనే వారిమీదనే విచారణ జరగాలి. కానీ కేరళ, తమిళనాడు, ఢిల్లీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల చెందినవారిని విచారణ చేస్తున్నారు. దేశ రాజధానిలో జరిగిన లిక్కర్ స్కాం 6,7 రాష్ట్రాల రాజకీయ నాయకులు, వ్యాపార వర్గాలు ఇన్వాల్వ్ అయ్యాయి. రాజకీయ కుట్ర అయితే కోర్టు తేలుస్తుంది, మీరెందుకు భయపడుతున్నారు అని ప్రశ్నించారు. తప్పు చేస్తే నా కొడుకు అయినా, బిడ్డనైనా వదిలి పెట్టను అని స్వయంగా అసెంబ్లీలో సాక్షిగా సీఎం కేసీఆర్ చెప్పారు. మరి తప్పు చేయకపోతే మీరు ఎందుకు భయపడుతున్నారు అని ఈటెల నిలదీశారు. రాజకీయపరమైన వేధింపులు అని రాజ్యాంగాన్ని, చట్టాన్ని అపహస్యం చేసే విధంగా మాట్లాడుతున్నారని కొట్టిపారేశారు. తెలంగాణలో సంపాదన సరిపోదు అన్నట్టుగా కేసీఆర్ కుటుంబ పాలనలో ఢిల్లీ దాకా ఎగపాకారు. రాజకీయ పరంగా వేధింపులకు పాల్పడితే ఆ కేసు కోర్టులలో నిలవదు. తప్పు చేశారా లేదా అనేది ఏజెన్సీలు తెలుస్తాయి. అన్ని ఆధారాలు ఉన్నాయని దర్యాప్తు సంస్థలు చెప్తున్నాయి. చట్టం ముందు అందరూ సమానులే, చట్టంపై మాకు సంపూర్ణ నమ్మకం ఉన్నవాళ్లం.. తప్పు చేసిన వారు తప్పించుకోలేరని ఈటెల రాజేందర్ అన్నారు. సీఎం కేసిఆర్ అబద్దాలను కూడా ప్రజలను నమ్మించే విధంగా చెప్పగలరు. మీరు దోచుకోండి.. దాచుకోండి.. మీకు ఆపద వచ్చినప్పుడు మీకు అండగా ఉంటామని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఏమన్నా కేసీఆర్ కుటుంబానికి రాసి ఇచ్చారా? అని ఈటెల రాజేందర్ అసహనం వ్యక్తం చేశారు. మీకు కష్టం రాగానే కాపాడండి అని అడగడానికి ఎమ్మెల్సీ కవితకు సపోర్ట్‌గా తెలంగాణ రాష్ట్ర అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఎలా వెళ్తారని ప్రశ్నించారు. లిక్కర్ స్కాంకి అడ్వకేట్ జనరల్‌కు ఏంటి సంబంధం.. మంత్రులకు లిక్కర్ స్కాంకి ఏం సంబంధం.. ప్రజల సొమ్ము ఇలా ఎందుకు ఖర్చు పెడుతున్నారని నిలదీశారు.

## వేట ముమ్మరం

**(మొదటి పేజీ తరువాయి)**
యునైటెడ్ సిక్స్ అనే సంస్థ, కెనడాలోని యాక్టివిస్ట్ గుర్‌దీప్ సింగ్ సహోటా తదితరుల ట్విటర్ ఖాతాలను నిలిపేశారు. వీరి ట్విటర్ ఖాతాలను యాక్సెస్ చేయడానికి భారత దేశంలో ప్రయత్నిస్తే, లీగల్ డిమాండ్ మేరకు ఈ ఖాతాలను నిలిపివేశాం అనే సందేశం కనిపిస్తుంది. జగ్మీత్ సింగ్ భారత దేశ వ్యతిరేకి అనే సంగతి అందరికీ తెలుసు. ఆయన ట్విటర్ ఖాతాను నిలిపేయడం చాలా ముఖ్యమైన పరిణామం. అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, తదితర దేశాల్లోని భారతీయులపైనా, హిందువులపైనా దాడులు జరిగిన నేపథ్యంలో ఈ ఖాతాలపై ఆంక్షలు విధించారు. ఖలిస్థాన్ వేర్పాటువాద ఉద్యమానికి మద్దతిచ్చేవారు గతవారం లండన్‌లోని భారత హై కమిషన్ కార్యాలయంపై దాడి చేసి, విధ్వంసం సృష్టించారు. అదేవిధంగా శాన్ ఫ్రాన్సిస్కోలోని ఇండియన్ కాన్సులేట్‌పై కూడా దాడి చేశారు. ఈ రెండు సంఘటనలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

# యు..గాది ...

**"శోభకృత్"నామ తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు...**



"ఆంగ్ల న్యూ ఇయర్ లాగా"..........
31 డిసెంబర్ అర్ధరాత్రి నుండే హంగులు ఆర్భాటాలు లాగా
తెలుగు నూతన సంవత్సరం ముందు రోజు అర్ధరాత్రి నుండి కేక్ కటింగ్ లు లేవు. డిజే లు..లేవు.. ఆటలు పాటలు డాన్సులు లేవు! తాగి తందనాలటలూ లేవూ. యాక్సిడెంట్ లై ఆకస్మిక మరణాలు లేవు. ఉన్నదంతా ఒక్కటే.. అచ్చమైన భారతీయ సంస్కృతి సంప్రదాయాలు. ముంగిళ్ళ ముగ్గులు. గృహానికి మామిడాకుల తోరణాల కళ కళలు.
ఉగాది పచ్చడి ఆస్వాదనలు. నేతి భక్ష్యాల ఘుమ ఘుమలు, నూతన వస్త్రాల అలంకరణలు. పంచాంగ శ్రవణాలు... రాజపూజ్య, అవమానాల, కందాదాయ ఫలములు! కోకిలమ్మల కమ్మని పాటలు. చైత్ర మాసపు వసంత ఋతువు ఆగమన శోభతో, పచ్చని పల్లవాలతో పరవశించిన ప్రకృతి కాంత!
శిశిరంలా గతించిన మన బాధలను విసర్జించి,
వసంతంలా రాబోయే మంచి రోజుల ఆస్వాదనలకై...
"శో భ కృత్"నామ సంవత్సరం శుభాలను చేకూర్చుతూ,
మన జీవితాలను శోభాయ మనం చేస్తూ,
ఉజ్వల ఉగాదిని.. మన ముందుకు తీసుకురావాలని మనసారా ఆకాంక్షిస్తూ.. "శు భ కృత్.."కు వీడ్కోలు పలుకుతూ..
అందరికీ "శోభకృత్"నామ తెలుగు సంవత్సరాశుభాకాంక్షలతో.....
స్వాగతం... సుస్వాగతం....
ఆయుష్యమస్తు ఆరోగ్యమస్తు
సర్వేజనా సుఖినోభవంతు

**తిరునగరి పద్మ, తెలుగు పండిట్**

## ఉత్తమ అవార్డు గ్రహీత
# డాక్టర్ సిద్దప్పకు ఘనసన్మానం


**గద్వాల మార్చి 21 (ప్రజామంటలు):** జోగులాంబ గద్వాల జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ ఓ, జిల్లా టిబి ప్రోగ్రామ్ ఆఫీసర్, ఉత్తమ అవార్డు గ్రహీత డాక్టర్ సిద్దప్ప ను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జోగులాంబ



గద్వాల జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాష్ అధ్వర్యము లో ఘనంగా సన్మానించారు. యూనియన్ జిల్లా నేత జయప్రకాష్ ముందుగా బొకే ఇచ్చి, శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. రాష్ట్ర క్షయ వ్యాధి నిర్మూలన జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం చేతుల మీదుగా ఉత్తమ అవార్డును డాక్టర్ సిద్దప్ప అందుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా జనరల్ సెక్రెటరీ కిరణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, సలహాదారులు శాదిక్, సిహెచ్ఓ రామకృష్ణ, టిబి సూపర్ వైజర్ బిక్షపతి, నరేందర్, విజయ్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్
# చెక్కుల పంపిణీ చేసిన డా. కల్వకుంట్ల సంజయ్

**కోరుట్ల గద్వాల మార్చి 21 (ప్రజామంటలు):** మండలానికి సంబంధించిన లబ్ధిదారులకు 34,00,544 రూ. విలువగల కళ్యాణ లక్ష్మి చెక్కులను 34 మంది



లబ్ధిదారులకు 13,12,000 రూ. విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. రాబోయే రోజుల్లో ఇంకా మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. ముఖ్యమంత్రి కేసీఆర్ మానస పుత్రిక అయిన కళ్యాణలక్ష్మీ పథకం ఆడపిల్లకు ఓ వరం లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, బిఆర్ఎస్ మండల్ ప్రెసిడెంట్ రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ పవన్, రైతు సమితి జిల్లా అధ్యక్షులు చీటి వెంకట్రావు, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డ్ నెంబర్స్, కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైశ్వకర్మణ పంచాంగ ఆవిష్కరణ చేసిన కలెక్టర్

**జనగామ మార్చి 20 (ప్రజామంటలు):** రాళ్ళబండి లంకేశ్వరా చార్యులుచే సూర్యసిద్ధాంత ఆధారంగా గణించబడిన శోభకృత్ నామసంవత్సర వైశ్వకర్మణ



పంచాంగమును (2023-2024) అయ్యప్ప ఆలయ ప్రధాన పూజారి బ్రహ్మశ్రీ కాసోజు రాజేశ్వరాచార్యులు ఆధ్వర్యములో జనగామ జిల్లా కలెక్టర్ సి.హెచ్.శివలింగయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోబాధ్యులు కొక్కొండ జగదీశ్వరా చారి, నల్లనాగుల రాజు, టి. మల్లికార్జున్, రంగు రామచంద్రమూర్తి, విశ్వబ్రాహ్మణ మాతృసంఘ అధ్యక్షులు నారోజు రామేశ్వరా చారి, విశ్వబ్రాహ్మణ ఐక్యసంఘ అధ్యక్షులు దిగోజు నరసింహ చారి,చక్రపాణి పాల్గొన్నారు.

# ప్రజలతో మమేకమై సాగుతున్న "హాత్ సే హాత్ జోడో యాత్ర"

**జనగామ మార్చి 20 (ప్రజామంటలు):** టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు జనగామ మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు లో జనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, జనగామ మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల అరుణ సత్యనారాయణ రెడ్డి, జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసాన్ పల్లి లింగాజీ, జనగామ జిల్లా నాయకులు ఉడత రవి యాదవ్, జనగామ పట్టణ నాయకులు బాల్దే శ్రీశేలం అసర్ల సంపత్, బడికె వినయ్ పాల్గొని మాట్లాడారు. గడప గడపను తట్టుతూ ప్రతిఒక్కరి సమస్యలను తెలుసుకుంటూ వారి కష్టాలకు భరోసా ఇస్తూ భవిష్యత్తులో రాబోయేది,రైతు రాజ్యమని, ఉత్సాహం నింపారు. నియంత్రత్వ అవినీతి పాలన అంతమొందించే సమయం ఆసన్నమైందని ఇక కొద్ది రోజులు సమయం ఉందని వచ్చేది కాంగ్రెస్ రాజ్యమేనని భరోసానిచ్చారు. టిఆర్ఎస్ పాలనతో విసుకు చెందిన ప్రజల కష్టాలను తెలుసుకుంటూ యాత్రలో ముందుకు సాగుతుండగా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. కేసీఆర్ మాటలు..నీటిమీద రాతలె 9 ఎండ్లలో బి.ఆర్.ఎస్ పాలనలో ఒక్కడబుల్ బెడ్ రూం ఇల్లు కూడా రాలేదు. రైతు రుణమాఫీ లేదు. ఇంటికో ఉద్యోగం లేదు .. లక్ష ఏకరాలకు నీళ్ళు లేవు. మాయల మరాఠీ. గారడి మాటలు అని .. బి.ఆర్.స్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనగామ పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మోటే శ్రీనివాస్ జనగామ జిల్లా నాయకులు రంగు రవి, జనగామ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యండి మాజిద్, జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతీష్, జయ మల్లేశ్, మైనార్టీ సెల్ నాయకులు జఫర్ షరీఫ్, మహేశ్వరం శ్రీనివాస్, పిట్టల




రాజు, నోముల రాజు, దేవర సత్తయ్య, వికలాంగుల సంఘము నాయకులు మేకల సమ్మయ్య, జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ యండి ఫయాజ్, సౌద మహేష్, కొండ శ్రీనివాస్, అయ్యప్ప రాజు, కొండ కిరణ్, సులేగం రాఘవేంద్ర, యండి. ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు

# మానవ అక్రమ రవాణా అతి పెద్ద నేరం

● **సీడీపీఓ వీరలక్ష్మి**

**జగిత్యాల మార్చి 21 (ప్రజామంటలు):** మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద నేరమని దీనిని అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జగిత్యాల సిడిపిఓ వీరలక్ష్మి అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం మనుషుల అక్రమ రవాణా పై అంగన్వాడి టీచర్లకు స్థానిక క్రీడా కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ వీరలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.... మానవ అక్రమ రవాణా ప్రపంచం లోనే 3 వ అతి పెద్ద నేరం గా ఉందని, దీనిని అరికట్టడంలో అంగన్వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను సమాజంలో అమలు చేయాలని సూచించారు. ప్రతి అంగన్వాడీ టీచర్ తమ పరిధి లోని అన్ని వర్గాల ప్రజల సామజిక, ఆర్థిక స్థితి గతులపై అవగాహన పెంచుకొని అందరిని అప్రమత్తం చేయాలన్నారు. ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ మాట్లాడుతూ.... ప్రజ్వల సంస్థ ఈ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. గత 27 సంవత్సరాలుగా పద్మ శ్రీ డా. సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్, పోలీస్, జ్యుడీషియల్ డిపార్ట్మెంట్ల సహకారం తో ఇప్పటి వరకు 26500 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి, వారికీ పునరావాసం కల్పించడం జరిగిందని తెలిపారు. నేటి యువత ఇంటర్నెట్, మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్ కి గురి అవుతున్నారని, వారిని



గమనిస్తూ అప్రమత్తం చేయాలనీ అన్నారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలలో అంగన్వాడీ టీచర్ లకు అవగాహన కల్పిస్తూ సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య వంతం చేస్తున్నామని అన్నారు. అంగన్వాడీ టీచర్లకు లఘు చిత్రల ద్వారా, బృంద చర్చల ద్వారా స్కిట్ ప్లే ల ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్లు శ్రావ్య శ్రుతి, చెన్నయ్య ఐసిడిఎస్ సూపర్ వైజర్ లు జానకి, స్వరూప, రాణి జగిత్యాల ప్రాజెక్ట్ లోని అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## గాయపడిన గీతా కార్మికుడికి
# తాడి కార్పొరేషన్ నుండి 15 వేల రూపాయల ఆర్థిక సహాయం

**చిగురుమామిడి మార్చి 21 ( ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిగురుమామిడి గ్రామంలో బూరుగు సంజీవ్ గౌడ్, తాడిచెట్టు ఎక్కి అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాల పాలు కావడం జరిగింది. ఇట్టి సమాచారాన్ని బండారి పల్లి చంద్రయ్య గౌడ్, సొసైటీ అధ్యక్షులు మరియు బుర్ర పరిసరాములు గౌడ్, ద్వారా సర్వాయి పాపన్న గౌడ్, సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మ్యాడగొని బుచ్చయ్య గౌడ్ కి వివరాలు పంపించగా వెంటనే స్పందించి తాడి కార్పొరేషన్ చైర్మన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ బుర్ర వెంకటేశం గౌడ్, ఐఏఎస్ కు పంపించగా వెంటనే స్పందించి 15 వేల రూపాయల చెక్కును బీసీ కార్పొరేషన్ కరీంనగర్ కి పంపించగా బీసీ కార్పొరేషన్ అధికారి రాజ మనోహర్ రావు 15 వేల చెక్కును అందజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో బుర్ర పరశురాముల గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు తాళ్ల పెల్లి తిరుపతి గౌడ్, సొసైటీ అధ్యక్షులు బండారిపల్లి చంద్రయ్య గౌడ్, ఆకుల మొగిలి బుర్ర పరశురాములు గౌడ్, ఈనాడు విలేఖరి బండారిపల్లి రాజమల్లు పాల్గొన్నారు. ఈ చెక్కు రావడానికి సహకరించిన బుర్ర వెంకటేశం గౌడ్, ఐఏఎస్ కి, ఎక్సైజ్ మినిస్టర్ వి. శ్రీనివాస్ గౌడ్, కి బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, పాముకుంట్ల రవీందర్ గౌడ్, మ్యాడగొని బుచ్చయ్య గౌడ్, సర్వాయి పాపన్న





గౌడ్, సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియపరచారు.

# "ఉగాది"

నూతన ఉత్తేజంతో
చిగురించిన కొత్త ఆశలకు
రంగురంగుల సుమ కుసుమాల
పందిరి వేయగా వచ్చేసింది
తొలి ఉగాది..!
పండిన కొత్త చింత పులుపు, వగరు మామిడి
ఊరింపులు పలుకగా
భిన్నసంస్కృతులకు బహు పునాది
వేస్తూ వచ్చేసింది
తొలి ఉగాది..!
సంస్కృతి సాంప్రదాయలను ఒకటిగా చేసి
చైత్ర మాసపు ఊసులు చెప్తూ
గండు కోయిల తీయని కోయిల పాటలతో
స్వాగతం సుస్వాగతం పలుగాగ వచ్చేసింది
తొలి ఉగాది..!
ప్రకృతి పరవశించగా
పంచభూతాలు దీవించగా
షడ్రుచుల అభినందనలతో
పంచాంగ శ్రవణంతో
స్వాగతం పలుగగా వచ్చేసింది
తొలి ఉగాది..!
మానవ విలువల పతనం,
అమాయక అమ్మాయిల బ్రతుకులపై
యాసిడ్‌దాడులు, అత్యాచారాలతో
రక్తమొడ్డుతున్న రహదారులు
అంతమొంది... ప్రతి ఒక్కరి
జీవన నవగమనానికి



సంతోష వసంతాలనిస్తూ వచ్చే
శ్రీ శుభకృతు నామసంవత్సరానికి
స్వాగతం సుస్వాగతం పలుకుతూ..
మీకు, మీ కుటుంబ సభ్యులకు ' శ్రీ శుభకృత్' నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు.
మీ...

**మంజుల పత్తిపాటి (కవయిత్రి )**
**ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్.**
**బ్రాహ్మణ సేవా వాహిని, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు**



**జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం గొర్రెపల్లి గ్రామ సర్పంచ్ కుమారుడు కొంపల్లి రాజా విష్ణు (34) తన స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా గుండెపోటుతో మృతి. పండగపూట విషాదంలో మునిగిన గ్రామ ప్రజలు, కుటుంబీకులు**

# ప్రజామంటలు వార్తకు స్పందన

## రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు

**భీమదేవరపల్లి మార్చి 21 (ప్రజామంటలు):** రోడ్లన్నీ బురదమయం ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు శీర్షికన ప్రజామంటలు తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రచురించిన వార్తకు



గ్రామపంచాయతీ పాలక వర్గం, కాంట్రాక్టర్ స్పందించారు. ముస్తఫాపూర్ లో ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తకొండ వైపు వెళ్లే రోడ్డు బురదమయం కావడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజామంటలు పత్రిక వివరించింది. సోమవారం గ్రామ పంచాయతీ స్పందించి జెసిబి సహాయంతో రోడ్డుకు ఒక పక్క కాలువ తీసి రోడ్డుపై నిలువ ఉన్న నీటిని కిందికి వెళ్లే ఏర్పాటు చేశారు. ప్రజా సమస్యలను కళ్లకు కట్టినట్టు ప్రచురించడంతో సమస్య పరిష్కారమైనదని స్థానికులు తెలిపారు.


బురుదమయంగా
మారిన ముస్తఫాపూర్ రహదారి
ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు


## కంటి వెలుగు కార్యక్రమాన్ని
## ప్రారంభించిన ఎంపీపీ జజాల భీమేశ్వరి

**ఇబ్రహీంపట్నం మార్చి 21 (ప్రజామంటలు):** మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని





ఎంపీపీ జాజాల భీమేశ్వరి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమంలో జడ్పిటిసి కంతం భారతి వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి సర్పంచ్ నేరెళ్ల హేమలత ఉపసర్పంచ్ మొండి వనిత, ఎంపీడీవో ప్రభు, తాసిల్దార్ మహేశ్వర్,డాక్టర్ శ్రీజ, డాక్టర్ మారుతి మరియు ఎంపీ ఓ కృపాకర్, ఏపిఎం శంకర్, నాయకులు జాజాల జగన్ రావు, కంతం రమేష్, నేరెళ్ల దేవేందర్ మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




**మృదుల కిడ్స్ డే కేర్ సెంటర్‌లో జరిగిన శోభకృత్ నామ ఉగాది సంబరాలు. ఉగాది ప్రత్యేకతను పిల్లలకు తెలిపిన మానేజ్మెంట్ తడాకాపల్లి సునీత**




**చిగురుమామిడి నూతన సబ్ ఇన్స్పెక్టర్ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసిన రేకొండ గ్రామ యువకులు. పాల్గొన్న బేకరి యజమాని తాటికొండ సందీప్ రెడ్డి, వార్డ్ మెంబర్ పరుపటి మహిపాల్ రెడ్డి, నెల్లి సతీష్ కాసాని సతీష్, వేణు సూర్య, శ్రీకాంత్ రమేష్, గ్రామ యువకులు**

# ఉగాదికి ముందు రైతన్నల కంటనీరు!

ఉగాదికి కొత్త పంటలతో ఆనందంగా గడపాల్సిన సమయంలో రైతులు దిగాలు పడ్డారు. అకాల వర్షాలు వారిని పుట్టెడు దుఃఖంలో ముంచాయి. కష్టపడి పంటలు పండించి..పంటలు ఇంటికి వచ్చే తరుణంలో కురిసిన అకాల వర్షాలు తీరని నష్టాన్ని నింపాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వడగళ్ల వానలు వారిపై పిడుగులు కురిపించాయి. పంట ఇంత నష్టోయామని చెప్పడానికి లేదు. ఏటా అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులు నష్టపోవడం.. ప్రభుత్వాలు ఊరడింపు వచనాలకు పరిమితం కావడం పరిపాటిగా మారింది. దేశంలో సమగ్ర పంటల బీమా పథకం లేకపోవడం అన్నదాతలకు శాపంగా మారింది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాదులాడు కోవడం తప్ప శాశ్వతంగా ఆదుకునే ప్రయత్నాలకు ఉపక్రమించడం లేదు. ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలం గడపడం తప్ప చేసిందేమీ లేదు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరి, అరటి, మామిడి, మిరప తదితర పంటలన్నీ సర్వనాశనం అయ్యాయి. వడగళ్లకు కోళ్లు, గొర్రెలు కూడా మృతి చెందాయి. నష్టం జరిగిన వెంటనే అంచనా వేసి పరిహారం ప్రకటించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా కురిసిన అకాలవర్షాలు అన్నదాతలను ఆగమాగం చేశాయి. రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటలను నీటిపాలు అయ్యాయి. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా పలు జిల్లాలో గత కొన్ని రోజులుగా ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మొక్కజొన్న, అరటి పంటలు నేలవాలగా, ధాన్యం తడిసిపోయింది. మిర్చి, పొగాకు పంటలు దెబ్బతిన్నాయి. మామిడి పిందె, పూత నేలరాలాయి. పిడుగుపాటుకు పలు ప్రాంతాల్లో వందలాది జీవాలు మృత్యువాత పడ్డాయి. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రూరల్ మండలంలో వెయ్యి ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. 50 ఎకరాల్లో మామిడి, 20 ఎకరాల్లో నిమ్మ తోటలు దెబ్బతిన్నాయి. బుచ్చినాయుడు కండ్రిగలో వరిపంట నేలకొరిగింది. రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయి. కళ్లాల్లో నీరు నిల్వ ఉండడంతో వేరుశెనగ పంట దెబ్బతింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాల కారణం నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వడగళ్ల వర్షానికి టమోటా, బొప్పాయి, కర్బూజా, మామిడితో పాటు పలు పూలతోటలు దెబ్బతిన్నాయి. ఈదురు మామిడి, సపోటాలు నేలరాలాయి. మామిడి పిందె, పూత రాలిపోయాయి. పలు జిల్లాలోని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అరటి, నిమ్మ, మామడి, చీని తోటలు దెబ్బతిన్నాయి. వందల ఎకరాల్లో తమలపాకులకు అరటి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. రోడ్లపై ఆరబెట్టిన



ధాన్యం వర్షం కారణంగా తడిసి ముద్ద యింది. చేతికొచ్చిన మొక్కజొన్న పంట వర్షానికి తడిచిపోయింది. పిడుగుపాటుకు కోళ్లు, పశువులు జీవాలు మృతి చెందాయి. కళ్లాల్లో ఉన్న మిర్చి వర్షానికి తడిసిపోయింది. కృష్ణా జిల్లాలో వర్షం కారణంగా పంట పొలాల్లో మినుప కాడ నీట మునిగి మినుములు ఉబ్బిపోయాయి. పిడుగుల ధాటికి గేదెలు మృతి చెందాయి. నువ్వు, జీడి మామిడి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతు న్నారు. కురిసిన వర్షాలకు వరిచేల్లోకి నీరు చేరింది. వడగండ్ల వాన వల్ల పంటలు దెబ్బతిన్న రైతులు ఆందోళన చెందవద్దని తెలంగాణ మంత్రులు సూచించారు. అధికారులతో సర్వే చేయించి నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో జరిగిన నష్టంపై తమ దృష్టికి తీసుకుని రావాలని ప్రజా ప్రతినిధులు, అధికారులకు సూచించారు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..మోడీ తన ఎన్నికల ప్రణాళికలో ముఖ్యమైనది ఉత్పాదకతను పెంచేందుకు వ్యవసాయ, గ్రామీణ రంగాల్లో రూ 25 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టడం వంటి హామీలు ఇచ్చారు.

దేశమంతటా గిడ్డంగుల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి సమర్థ వంతమైన నిల్వ, రవాణా యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తానని ప్రణాళికలో ప్రకటించారు. ఇప్పటికి ఈ రెండు హామీలను మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదు. అంతేకాదు గ్రామస్థాయిలో నిల్వ పథకాన్ని అమలు చేస్తామని, రైతులు తాము నిల్వ చేసుకున్న ఉత్పత్తులకుగాను రుణాలు ఇస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన ఆచరణకు రాలేదు. ఇకపోతే చిన్న, మధ్యతరహా రైతులకు పింఛను పథకం కానీ, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనను దేశంలో అందరు లబ్ధిదారులకు అమలు చేయడం కానీ జరగలేదు. రైతులకు వడ్డీ లేకుండా కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలు ఇవ్వడం, రైతులు భరించదగ్గ రేట్లలో వారి ఇంటికే నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసి గుమ్మం వద్దే టెస్టింగ్ సౌకర్యాలు కల్పించడం, సహకార సంఘాల ద్వారా వ్యవసాయ, పాడి, మత్స్య ఉత్పత్తులను నేరుగా మార్కెట్ చేయడం, నూనెగింజల విషయంలో స్వయంసమృద్ధి సాధించడం లాంటి హామీలు అమలులోకి వచ్చిన దాఖలాలు కనపడడం లేదు. అత్యంత వేగంగా దేశంలో పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, మన నీటి పారుదల సామర్థ్యాన్ని నూటికి నూరుశాతం వినియోగించు కుంటామని ఇచ్చిన హామీలు కూడా కాగితాలు దాటి రాలేదు. వ్యవసాయరంగాన్ని ఏ విధంగా ఆదుకుంటు దన్నదే ప్రశ్న. బహుశా తన నిస్సహా యతను కప్పి పుచ్చుకునేందుకే మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగంపై కార్పోరేట్ అస్త్రం ప్రయోగించి ఉంటారన్న అనుమానాలు కూడా వచ్చాయి. సాగుచట్టాలు తేనె పూసిన కత్తులని, చిన్న, మధ్యతరహా రైతుల జీవితాల ను దుర్భ రంగా మారుస్తాయని రైతుసంఘాల నేతలు విస్పష్టంగా ప్రకటించారు.

దేశంలో చాలాకాలం తర్వాత మోదీ ప్రభుత్వానికి ఒక బలమైన వ్యతిరేకత వ్యక్తమయ్యింది. నిజానికి ఈ బిల్లులపై పారదర్శకంగా, ప్రజాస్వామికంగా చర్చలు జరిపి, రైతులకు ఏ రకంగా మేలు చేయవచ్చో చర్చించి, అన్ని పక్షాలను విశ్వాసంలోకి తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగేదు. ఇప్పటి కైనా ప్రభుత్వాలు మేల్కొని సమగ్ర వ్యవసాయ చట్టాలకు శ్రీకారం చుట్టాలి. అన్నదాతలను ఆదుకునేలా, పంటలను కొనుగోలు చేసేలా, ప్రకృతి వైపరీత్యాల్లో అండగా ఉండేలా, సమగ్ర మార్కెట్ వ్యవస్థ అమల య్యేలా చట్టాలను రచించు కోవాల్సి ఉంది. తాజాగా నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకుని వారిని రక్షించడం ద్వారా ఉగాదికి వారిని ఊరడించే యత్నాలు మొదలు పెట్టాలి.





## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## మొలకలు

తినగ తినగ వేము...

అమ్మ ఉగాది పచ్చడి తయారు చేయడం గమనించిన గానే "అమ్మా, నేను అన్విత ఇంటికి వెళ్లి వస్తాను "అంటూ గట్టిగా చెప్పి తల్లి సమాధానం చూడకుండా తుర్రుమని వెళ్ళింది అరవతరగతి చదువుతున్న రుత్వి.

ఈ సమయంలో కూతూరు ఎందుకు వెళ్లిందో పసిగట్టింది స్వాతి. పోయిన సంవత్సరం ఉగాది పచ్చడి తిననంటూ మొండికేసినా బలవంతంగా తినిపించడంవలన వాంతి చేసుకొంది .ఈ రోజు ఉగాది



పచ్చడి తినడం తప్పించుకొనడానికి అన్విత ఇంటికి వెళ్లిందని స్వాతి ఊహించింది.

చాలాసేపు బయట పిల్లలతో ఆడుతూ గడిపిన తరువాత ఇంటికి వచ్చింది.

"ఎదురింటి అమ్మాయికి ఎలా వుంది ఇప్పుడు వెళ్లి చూసావా "అడిగింది స్వాతి

" తలకు కుట్లు వేయడం గాయం మానినా ఇంకా నొప్పిగా ఉందట .ఆడుకొనడానికి రాలేదు అమ్మా " అంది రుత్వి.

"రుత్వీ, ఈ ఉగాదినుండి కొత్త నిర్ణయాలు తీసుకొంటున్నాను "అంది తల్లి.

"ఏమిటమ్మా " అడిగింది.

"నీకు ఉగాది పచ్చడి అంటే ఇష్టంలేదని తెలిసింది. బలవంతంగా నీచేత తినిపించదలచుకోలేదు " అంది

"అలాగే అమ్మా " సంతోషంగా

"మరో నిర్ణయం ఏమిటంటే ఆటలు ఆడేటప్పుడు ఏదైనా గాయం ఏర్పడటానికి అవకాశం వుంది. నువ్వు ఆటలకు వెళ్ళినప్పుడంతా నేను బయపడుతుంటాను, ఇకమీదట ఆటలకు వెళ్ళవద్దు ,ఇంట్లోనే క్యారంబోర్డు ,చెస్ , పాచికలు లాంటి ఆటలు ఆడుకో రుత్వి "అంది అమ్మ

"అమ్మా ఆటలు ఆరోగ్యానికి మంచిది "అడిగింది సృజన

"ఆరు రుచులు కలిగిన ఉగాది పచ్చడి ఆరోగ్యానికి మంచిదంటారు .ఔషధగుణములున్న వేపపువ్వులో చాలా ఉందని నీకూ తెలుసు. వేపపువ్వు దొరికేంతవరకు పదిరోజులకొకసారైనా ఉగాది పచ్చడి చేయమని మీ నాన్న చెప్పినా నీకోసం వద్దన్నాను. ఆరోగ్యానికి మంచిదైనా ఆటలలో గాయం ఏర్పడుతుంతాన్న భయం నాలో ఉన్నట్లు, నీకు ఔషధగుణాలున్న వేప పచ్చడి తింటే వాంతి వస్తుందన్న భయం ,రెండింటినీ ఈ ఉగాదినుండి మానేద్దాం " అంది

"అమ్మా నేను ఉగాది పచ్చడి తింటానే ...అలాగే ఆటలు ఆడేటప్పుడు జాగ్రత్తతో ఆడుకొంటాను"అంది.

స్వాతి చిరునవ్వుతో కూతురు వైపు చూస్తూ సరేనన్నట్టుగా తలాడించింది.

ఇప్పుడు ఔషధ విలువలున్న ఉగాది పచ్చడిని రుత్వీ ఇష్టంతో తింటోంది. మొదటిసారి చేదు అనిపించింది. ఆ తరువాత చేదు అనిపించ లేదు. వేమన పద్యంలో చెప్పినట్లు 'తినగ తినగ వేము తీయనుండు' అన్న నిజాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొంది.

- ఓట్ర ప్రకాష్ రావు

తిరుత్తణి, 09787446026

## శోభకృతు ఉగాది శుభాకాంక్షలు

**1.తేటగీతం**

ప్రకృతి వాతావరణ భూమి పరిభ్రమణము
అరువది పేర్లతో అంత
రార్థమున్న!
వత్సరాదిన తెలుగింటి
ఉత్సవమ్ము!
వర్తమాన వసంతమా
వచ్చి పొమ్ము!

**2.సీసము.**

పంచాంగ జ్యోతిష్య
ప్రాధాన్యపు ప్రతీక
యుగ యుగాల
పునాది యగు ఉగాది!
శాలివాహనశక
చాంద్ర మాస శతాబ్ది
కాలమాన విలువ
గలయుగాది!
అరువది నామాలు
ఆమ్రేడితామని అరుదెంచు పర్వంబు
అది ఉగాది!
రైతు రబీ పంట
చేతి కందిన ఇంట
ఆర్థిక వత్సరంబగు
యుగాది!

**3.తే.గీ**

మోడుబారిన వృక్షాల
మోక్షమిచ్చి!
హిందుమత సంప్రదాయ ము
హితము గూర్చు!
షడ్రుచుల్ సంస్కృతి
తెలుపి శుభములొసగు!
ఎండమావుల భ(హ)రించు పండగిదియె!

- కదుగాయ చందర్ రావు,
(రోజాపతి).

# ఉగాదితో సర్వత్రా నూతనశోభ

## రాసులను బట్టి నవనాయకుల నిర్ణయం



ఉగాదితో నూతనశోభ సర్వత్రా వెల్లివిరుస్తుంది. ప్రకృతిలోని చెట్టు, పుట్ట అంతా ఆనంద మయంగా, ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. అలాంటి శుభవేళ మానవాళి అంతా ప్రకృతి పులకింతకు అనుగుణంగా మధురానుభూతు లను పరస్పరం పంచుకోవాలన్న ఓ మహత్తర సమసమాజ స్థాపన లక్ష్యం ఉగాది పండగ వెనుక దాగి ఉంది. శోభకృత్ నామ సంవత్సరం బుధ వారం నాడు వస్తోంది. కాబట్టి రాజు బుధుడని పరిగణించాలి. సూర్యుడు మేషరాశిలోకి సంక్రమించే వారాన్ని బట్టి మంత్రిని, సింహరాశిలోకి ప్రవేశించే వారం ఆధారంగా సేనాధిపతిని, కర్కాటక సంక్రమణం చేసే వారాన్ని బట్టి సస్యాధిపతిని, ధనూరాశిలోకి వచ్చే వారం ఆధారంగా ధాన్యాధిపతిని, మిథున సంక్రమణ జరిగే వారాధిపతిని అర్ఘాధిపతిగా, తులలో ప్రవేశించే రోజును బట్టి రసాధిపతిని, మకరరాశిలో ప్రవేశించే వారం ఆధారంగా నీరసాధిపతిని.. ఇలా నవ నాయకులను నిర్ణయిస్తారు. సూర్యుడు.. ఆరుద్ర నక్షత్రంలోకి ప్రవేశించే వారం అధిపతి ఆధారంగా మేఘాధిపతిని నిర్ణయిస్తారు. నవనాయకులను బట్టి.. సంవత్సర ఫలితాలను పంచాగకర్తలు అంచనా వేస్తారు. సంవత్సరాది ఏ వారం వస్తుందో.. ఆ వారానికి అధిపతిని రాజుగా నిర్ణయిస్తారు. రాజు, మంత్రి, సేనాధిపతి పరిపాలనను నిర్ణయిస్తారు. సస్యాధిపతిని బట్టి వర్షపాతం, ధాన్యాధిపతిని బట్టి ధాన్యవృద్ధి, అర్ఘాధిపతిని ఆధారంగా నవ్వులు, మినుములు మొదలైన వాటి దిగుబడి, మేఘాధిపతి ఆధారంగా వర్షాలు, పంటలు ధరలు, రసాధిపతిని బట్టి పులుపు, చేదు మొదలైన పదార్థాల ధరల హెచ్చుతగ్గులు నిర్ణయిస్తారు. ఉగాది అంటేనే రానున్నకాలానికి విషయాలు తెలుసుకునే అవకావం ఉంటుంది. కాలచక్ర పరిభ్రమణం ఆధారంగా నవనాయకుల నిర్ణయం జరుగుతుంది. ఆ విశేషాలను జ్యోతిషశాస్త్రం తెలియ జేస్తుంది. ప్రతి సంవత్సరానికీ రాజు, మంత్రి, సేనాధిపతి, సస్యాధిపతి, ధాన్యాధిపతి, అర్ఘ్యాధిపతి, మేఘాధిపతి, రసాధిపతి, నీరసాధిపతి అని తొమ్మిదిమంది నాయకులు ఉంటారు. వీరినే నవనాయకులు అంటారు. ఇక ఇళ్లలో కూడా పంచాంగానికి పూజలు చేయడం కూడా ఆనవాయితీగానే వస్తోంది. చంద్రుడి నక్షత్ర యోగాన్ని అనుసరించి చాంద్రమానం, సూర్య సంక్రమణాల ప్రకారం సౌరమానం, గురూదయాన్ని ఆధారంగా చేసుకొని బార్హస్పత్య మానం లెక్కిస్తారు. ఎవరి పరంపరాగతమైన, ప్రాంతాను సార మానాలు వారికి ప్రమాణాలు. ఇందులో వైరుధ్యాలేమీ లేవు. గణనలో విభిన్నత్వం ఉన్నా ఫలాల్లో, పంచాంగాల పద్ధతుల్లో పెద్దగా భేదమేదీ ఉండదు. ఈ పండగ రోజంతా కొత్త వాతావరణం స్ఫురిస్తూ ఉంటుంది.

# పంచాంగం ప్రాధాన్యత - ఋతువులు పూర్వాపరాలు

"కాల సృజతి భూతాని, కాలస్సంహరతే ప్రజా: కాలము చరాచర సృష్టికి, సృష్టి అంతానికి మూలాధారం. అందుకే కాలాన్ని దైవంగా భావిస్తారు. అలాంటి కాలాన్ని గురించి తెలుసుకు నేందుకు ఉపయోగపడే సాధనమే పంచాంగము. పంచాంగము అనగా పంచంఅంగము. కాలము యొక్క ప్రధాన అంగాలైన, విభాగాలైన తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణము అనే అయిదు అంగముల గురించి తెలుపుతుంది, కనుకనే పంచాంగము అని నమాంకితమైంది.


మనం ప్రస్తుతం వాడుతున్న క్యాలెండర్ తేదీలు, మాసాలు, సంవత్సరాలను సూచిస్తుంది. ఋగ్వేదంలో నక్షత్ర ప్రస్తావన ఉంది. పంచాంగం గ్రహ గణితానికి మూలమైన, సూర్య సిద్ధాంతం 10వ శతాబ్దంకు ముందు పేర్కొన బడింది. విక్రమ శకాన్ని ఉత్తర, పశ్చిమ భారతావనిలో, నేపాల్ లో అనుసరిస్తారు. అలాగే శాలి వాహన



శకమును దక్షిణ భారత దేశంలో, మహారాష్ట్ర, గోవా, ప్రాంతాలలో ఆచరిస్తారు. పూర్ణిమతో మొదలయ్యే నెలను పూర్ణిమాంత మాసమని, అమావాస్యతో పూర్తయ్యే మాసాన్ని అమాంత మాసమని అంటారు. మన దేశంలో అధిక ప్రదేశాలలో పూర్ణిమాంత మాసం వాడుకలో ఉంది.

మనం అనుసరిస్తున్న కాలం ఆరు భాగాలుగా విభజితమైంది. సంవత్సరం, ఆయనము, ఋతువు, మాసము, పక్షం, దినం. ఇక వివిధ సంవత్సరాలను పరిశీలిస్తే....(1). చంద్రుని గమనం ఆధారంగా చైత్ర శుక్ల పాడ్యమి మొదలుకొని ఫాల్గుణ కృష్ణ అమావాస్య వరకు గల కాలాన్ని చాంద్రమాన సంవత్సరం అంటారు. (2). సూర్యుడు మేష రాశిలో ప్రవేశించి మీన రాశి వరకు సంచరించే కాల ప్రమాణాన్ని సౌరమాన సంవత్సరం అంటారు. (3). 30 రోజులకు ఒక నెల చొప్పున 360 రోజులతో పన్నెండు మాసాలు కలిగి ఉండేది సావన మాస సంవత్సరం. (4). అశ్విని నుండి రేవతి వరకు కలిగిన, నక్షత్రాల మీదుగా చంద్రుడు సంచారం చేసే కాలాన్ని ఒక నెలగా, ఇలా పన్నెండు నెలలు అంటే 324 రోజులు కలిగిన కాలం నాక్షత్ర మాన సంవత్సరం.(5). గురువు ఒక రాశిలో ప్రవేశించి ఆ రాశిలో ఉండే కాలానుగుణ్యాన్ని బార్హస్పత్యమాన సంవత్సరం అంటారు.

ఇక ఆయనాల విషయానికి వస్తే, ప్రతి సంవత్సరం ఉత్తర, దక్షిణాయనాలు రెండు ఉంటాయి. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన దినం నుండి కర్కాటకం లో ప్రవేశించే వరకు ఉత్తరాయణం, తిరిగి మకరంలో ప్రవేశించే వరకు దక్షిణాయనం. ప్రతి రెండు మాసాలకు కలిపి ఒక ఋతువు. సంవత్సరానికి ఆరు ఋతువులు. చాంద్ర మానం ప్రకారం శుద్ధ పాడ్యమి నుండి అమావాస్య వరకు ఒక మాసం. అవి సంవత్సరానికి పన్నెండు ఉంటాయి. మాసానికి శుక్ల, కృష్ణ రెండుపక్షాలు. దినం అనగా సూర్యోదయం నుండి మొదలై తిరిగి సూర్యోదయంతో ముగిసేది. గ్రహాల పేర్లు ఆధారంగా దినాలకు పేర్ల నిర్ణయాలు జరిగాయి. గణనకు సంబంధించి, అవసరమైన సిద్ధాంత భాగం, ఖగోళ విజ్ఞానం పై ఆధారపడి ఉంటుంది. ఇదే పంచాంగ గణనకు మూలాధారం. గణనకు సంబంధించిన అంశాలను వివరించేవి సిద్ధాంత గ్రంథాలు.





సూర్య: పితామహో వ్యాస: వసిష్ఠోత్రి పరాశర: కాశ్యపో నారదో గర్గ: మరీచిర్మనురంగిరా: లోమశ: పౌలిశశ్చైవ చ్యవనో యవనో భృగు: శైనకోష్టాదశ హ్యేతే జ్యోతిష శాస్త్ర ప్రవర్తకా: అని మన ప్రాచీన జ్యోతిష సిద్ధాంత కారుల గురించి శ్లోకాధారం. తర్వాతి కాలంలో, భాస్కరాచార్యుడు, వరాహమిహిరుడు, బ్రహ్మ గుప్తుడు, ర్యభట్టు తదితర సిద్ధాంత గ్రంథ కర్తలు ఎందరో ఉన్నారు. వరాహ మిహిరుడు తదితరులు పంచాంగ రూపంలో రాయడానికి అవసరమైన, విధానాలను రూపొందించారు. వాటిని తంత్ర గ్రంథాలు అంటారు. గణేశ దైవజ్ఞాది పండితులు కరణ గ్రంథాలను రచించారు. పంచాంగ గణన సులభం చేశారు. ప్రస్తుత కాలంలో, గ్రహలాఘవం, గణకానందం, నర కంఠీరవం, తిథి రత్నావళి, తిథి చంద్రిక తదితరాలు అందుబాటులో ఉన్నాయి.

మానవుడు దైనందిన జీవితంలో ఎన్నో రకాల పనులు చేస్తూ ఉంటాడు. అవి ఎలాంటి ఆటంకాలు లేకుండా, సత్ఫలితాలు పొందడానికి, విజయవంతంగా పూర్తి కావడానికి ఉచిత సమయంలో, ప్రారంభించడం అవసరం. కాల ప్రవాహంలో ఎలాంటి సమయం, సదరు వ్యక్తికి అనుకూల లేదా వ్యతిరేక ఫలితాలను ఇస్తుందో, తెలుసు కోడానికి పంచాంగం ఉప యుక్తమవుతుంది. ప్రధానంగా భారత దేశంలో, ప్రతి శుభ, అశుభ కార్యక్రమానికి పంచాంగం ద్వారా ముహూర్తాన్ని లెక్కించి, దానిని ఆచరించడం అనాదిగా వస్తున్న ఆచరణ. పంచాంగాన్ని విశ్వసించే మానవుడు, జన్మించింది మొదలు మరణించే వరకు, ప్రతి కార్యక్రమంలో పంచాంగాన్ని అనుసరిస్తున్నాడు. ఒకనాడు యజ్ఞ, యాగాది క్రతువులకు, సాంప్రదాయ సత్కర్మలకు ముహూర్తాలు నిర్ణయిం ప బడగా, నేడు బారసాల, కేశఖండనం, వివాహం, నామకరణం,గృహాది నిర్మాణ ప్రారంభాలు, ప్రవేశాలు, వ్రతాలు, పూజలు, ఒక్కటేమిటి అన్నింటికీ, హైందవ జీవన విధానంలో పంచాంగానికి విడదీయలేని, సంబంధం అనుబంధం ఉంది.

### ఋతువులు పూర్వాపరాలు

వివిధ కాలాలలో వాతావరణంలో ఏర్పడే మార్పులను బట్టి భారతావనిలో సంవత్సరమును ఆరు ఋతువులుగా విభజించారు. రెండేసి నెలల చొప్పున వసంతం, గ్రీష్మం, వర్షం, శరత్తు, హేమంతం, శిశిరం అని సంవత్సరకాలాన్ని ఆరు ఋతువులుగా విభజించారు.

నిజానికి వేద వ్మాయంలో ప్రాచీనమైన ఋగ్వేదంలో ఆరు ఋతువుల ప్రస్తావన లేదు. ఋగ్వేదంలోని పదవ మండలం లోని పురుష సూక్తంలో ఋతువుల పేర్లు కనిపించే ఈ శ్లోకం చూడండి: "యత్ పురుషేణ హవిషా, దేవా యజ్ఞమతన్వత, వసంతో అస్యాసీద్ ఆజ్యం గ్రీష్మ ఇధ్మః శరద్ హవి" (ఋగ్వేదం10.90.6). పురుషుడే హవిస్సుగా దేవతలు చేసే సమస్త సృష్టి అనే యజ్ఞంలో వసంతం ఆజ్యం అయితే, గ్రీష్మం ఇంధనం, శరత్తు హవి. వసంతం, గ్రీష్మం, శరత్తు ఈ మూడు ఋతువుల పేర్లు తప్ప ఋగ్వేదంలో ఇతర ఋతువుల ప్రస్తావన కనిపించదు. కృష్ణ యజుర్వేదంలో కనిపించే ఈ కింది శ్లోకంలో పంచభూతాలవలే సంవత్సరంలో ఋతువులు కూడా అయిదు అన్న వివరణ కనిపిస్తుంది. "పంచ వా ఋతవః సంవత్సరస్ ఋతుష్వేవ సంవత్సరే ప్రతి తిష్ఠంతి" (యజుర్వేద 7.3.8). కృష్ణ యజుర్వేదానికే సంబంధించిన తైత్తిరీయ బ్రాహ్మణంలో అయిదు ఋతువుల వివరాలతో సంవత్సరాన్ని పక్షితో పోల్చుతూ చేసిన ఈ అందమైన వర్ణన ఉంది:


"తస్య తే వసంతః శిరఃబీ గ్రీష్మో దక్షిణః పక్షః ? వర్షాః పుచ్ఛంబీ శరద్ ఉత్తరః పక్షఃబీ హేమంతో మధ్యం"? (తై. బ్రా. 3.10.4.1). సంవత్సర మనే పక్షికి వసంతం శిరస్సు అయితే, గ్రీష్మం కుడి రెక్కబీ వర్షం తోకబీ శరత్తు ఎడమ రెక్కబీ హేమంతం మధ్యభాగం. అంటే, ఋగ్వేదలోని మూడు ఋతువులకు వర్ష ఋతువు, హేమంత ఋతువు ఈ కాలానికి జత చేయ బడ్డాయి. ఆరు ఋతువుల ప్రస్తావన మనకు తెలిసినంత వరకూ తైత్తిరీయ సంహితంలో (తైత్తిరీయ సంహితం, తైత్తిరీయ బ్రాహ్మణం తరువాతి కాలంలో వెలువడింది) మొదటి సారి కనిపిస్తుంది.

"మధుశ్చ మాధవశ్చ వాసంతికా వృతూ శుక్రశ్చ శుచిశ్చ గ్రైష్మా వృతూ నభశ్చ నభస్యశ్చ వార్షికా వృతూ ఇషశ్చోర్జశ్చ శారదా వృతూ సహశ్చ సహస్యశ్చ హైమంతికా వృతూ తపశ్చ తపస్యశ్చ శైశిరా వృతూ" (తైత్తిరీయ సంహత 4-4-11). మధు మాధవ మాసాలు వసంత ఋతువు. శుక్రము శుచి మాసాలు గ్రీష్మర్తువు. నభము, నభస్యము, వర్షర్తువు, ఇషము, ఊర్జము శరదృతువు. సహము, సహస్యము హైమంతిక ఋతువు. తపము, తపస్యము శైశిర ఋతువు. మనం ఇప్పుడు చెప్పుకొనే చైత్రం, వైశాఖం అన్న 12 మాసాల పేర్లు అప్పటికింకా ప్రాచుర్యంలోకి రాలేదు. వాటికి మారుగా, మధు, మాధవ, శుక్ర, శుచి, ఇషము, ఊర్జ, సహ, సహస్య, తప, తపస్య అన్న పేర్లు ఇక్కడ కనిపిస్తాయి. అయితే ఇప్పుడు వాడే చైత్రం, వైశాఖం అన్న పేర్లు నక్షత్రాలకు సంబంధించినవి. నక్షత్రాల ఆధారంగా చంద్రుని గమనాన్ని పరిశీలిస్తే చంద్రుడు ఒక నక్షత్ర కూటమి నుండి బయలు దేరి మళ్ళీ అదే నక్షత్ర కూటమిని చేరుకోవ డానికి దాదాపు 27రోజులు పడుతుందని తెలుస్తుంది.

దీన్ని నాక్షత్రిక మాసం అంటారు. ఈ 27 రోజుల్లో చంద్రుడు దాటే ఒక్కొక్క నక్షత్ర కూటమికి ఒక్కో పేరు చొప్పున అశ్విని, భరణి మొదలైన 27 నక్షత్రాల పేర్లు ఏర్పాటు చేసారు. ఆపైన, ప్రతి మాసంలో నిండు పున్నమ నాడు చంద్రుడు ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రపు వృద్ధి రూపమే ఆ మాసానికి పేరుగా ఇవ్వడం మొదలు పెట్టారు. ఆ రకంగా చిత్త నక్షత్రంలో పౌర్ణమి వస్తే ఆ మాసం చైత్ర మాసంగా, అలాగే, విశాఖ నక్షత్రంలో పౌర్ణమి వస్తే వైశాఖంగా పిలువ బడింది. ఇదే విధంగా సూర్యునికి సంబంధించిన సంవత్సర కాలాన్ని 27 భాగాలుగా విభజన చేసి వాటిని కార్తెలు అని అన్నారు. ఒక్కో నక్షత్ర కూటమిలో సూర్యుడు దాదాపు 2 వారాల పాటు ఉంటాడు కాబట్టి ఒక్కో కార్తె సుమారుగా 13 రోజులు ఉంటుంది. అశ్విని కార్తె మొదలు రేవతీ కార్తె వరకూ సాగే ఈ కార్తెల విభజన వ్యవసాయ దారులకు చాలా ఉపయోగకరం. భారత దేశంలో ఆచరణలో ఉన్నవి ఆరు ఋతువులు.

### వసంత ఋతువు: చైత్రం, వైశాఖం

సుమారు 20-30 డిగ్రీల ఉష్ణోగ్రతబీ చెట్లు చిగురించి పూవులు పూ స్తాయి. వివాహాల కాలం ,ఉగాది, శ్రీరామ నవమి, వైశాఖి, హనుమజ్జయంతిబీ గ్రీష్మ ఋతువు: జ్యేష్టం, ఆషాఢం బాగా వేడిగా ఉండి 40 డిగ్రీల ఉష్ణోగ్రత, ఎండలు మెండుగా ఉంటాయి. వట పూర్ణిమ, రథాయాత్ర, గురు పూర్ణిమబీ వర్ష ఋతువు: శ్రావణం, భాద్రపదం చాలా వేడిగా ఉండి అత్యధిక తేమ కలిగి భారీ వర్షాలు కురుస్తాయి. రక్షా బంధన్, శ్రీకృష్ణ జన్మాష్టమి,వినాయక చవితి, ???. శరదృతువు: ఆశ్వయుజం, కార్తీకం. తక్కువ ఉష్ణోగ్రత, దసరా నవరాత్రి, విజయ దశమి, దీపావళి, శరద్ పూర్ణిమ బిహు, కార్తీక పౌర్ణమిబీ హేమంత ఋతువు: మార్గశిరం, పుష్యం. చాలా తక్కువ ఉష్ణోగ్రతలు (20-25) మంచు కురిసి, చల్లగా నుండు కాలము. పంటలు కోతల కాలం. భోగి, సంక్రాంతి, కనుమబీ శిశిర ఋతువు: మాఘం, ఫాల్గుణం, బాగా చల్లని ఉష్ణోగ్రతలు, 10 డిగ్రీల కంటె తక్కువ, ఆకురాల్చు కాలం, ఉగాది, వసంత పంచమి, రథసప్తమి/మకర సంక్రాంతి, శివరాత్రి, హోళీ... భారతీయ పురాణాలలో, శరదృతువు సరస్వతి దేవతకి ఇష్టపడే కాలంగా పరిగణించ బడుతుంది, దీనిని "శరదృతువు దేవత" (శారద) అని కూడా పిలుస్తారు. అలంకార శాస్త్రం నిర్దేశించిన అష్టాదశ వర్ణనల్లో ఋతు వర్ణన ప్రధానమైనది కాబట్టి మన తెలుగు కావ్యాలలో కూడా సాంప్రదాయికంగా ఈ ఆరు ఋతువుల వర్ణనే కనిపిస్తుంది.



-ఆర్కె సంగనభట్ల
9440595494

# "శుభం పలుకుతున్న శోభకృతుకి స్వాగతం, సుస్వాగతం"

"ఉగాది" తెలుగు వారి తొలి పండుగ. చైత్ర మాసంలో వచ్చే మొదటి రోజుని ఉగాది అని, సంవత్సరాది అని, యుగాది అని పిలుస్తుంటారు. "యుగం" అంటే "యోగం". మనిషి బ్రతుకు కాలంతో ముడిపడి ఉండటమే యోగం. అలా యోగానికి తొలినాడు కావడంవల్ల "యుగాది" అని కూడా పిలుస్తుంటారు ఈ పండుగని. అలాగే శ్రీ "ప్రభవ" నామ సంవత్సరం నుండి "అక్షయ" నామ సంవత్సరం వరకు సంవత్సరం ప్రారంభం రోజుని కూడా 'ఉగాది' లేదా 'యుగాది' అంటాము. శరదృతువులో ఆకులన్ని రాలిన పోయి మోడులైన చెట్లను చిగురింపచేసి తిరిగి కొత్త జీవనమైన వసంత ఋతువు ప్రారంభమవుతుంది. ఈ వసంత రుతువులో పక్షుల కిలకిలారావాలు, కోయిలలు కుహూ కుహూ రాగాలతో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ నూతన ఉగాదికి స్వాగతం పలుకుతాయి. అలాగే ప్రకృతిమాత కూడా ప్రశాంతచిత్తంతో పిల్లగాలుల్ని వీస్తు సంతోషాన్ని వ్యక్తం చేస్తుంది.

ఇలా ప్రకృతిమాత సైతం పరవశించే ఈ ఉగాది పండుగ వెనుక ఒక పురాణ కథ కూడా ఉంది. విష్ణుమూర్తి నాభిలో నుంచి పెరిగిన కమలం నుంచి బ్రహ్మ పుట్టాడు. కొంతకాలానికి బ్రహ్మ, విష్ణువును తనతోపాటు ఉండమని కోరాడు. అప్పుడు విష్ణువు పాలకడలిలో శేషతల్పంపై పడుకున్నట్లు ఉన్న తన విగ్రహాన్ని బ్రహ్మకు ఇస్తాడు. ఇదే దేవుని మొదటి విగ్రహంగా చెబుతారు. ఆ విగ్రహాన్ని ఆరాధిస్తూ సృష్టి పూర్తి చేస్తున్న బ్రహ్మ ఆ తర్వాత కొంతకాలానికి సూర్యునికి ఆ విగ్రహాన్ని ఇస్తాడు. సూర్యుడు తన కొడుకైన మనువుకు ఇస్తాడు. మనువు తన కొడుకైన ఇక్ష్వాకునికి ఇస్తాడు. అదే వంశంలో పుట్టిన శ్రీరాముడు కూడా ఈ విగ్రహాన్ని ఆరాధించాడు. ఆ తర్వాత విభీషణుడు ఆ విగ్రహాన్ని తీసుకుంటాడు. అయితే లంకకి తీసుకు వెళ్ళే దారిలో విభీషణుడు దానిని పొరపాటున నేలపై పెడతాడు. దాంతో ఆ విగ్రహం అక్కడే పాతుకుపోతుంది. ఆ ప్రదేశమే తమిళనాడు రాష్ట్రంలోని శ్రీరంగం అని, ఆ స్వామి వారే శ్రీ రంగనాథ స్వామి వారని పురాణ గాథ. ఈ సంఘటన కూడా ఉగాదినాడే సంభవించింది. అందుకే ఈ పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ ఉగాది పండుగని తెలుగు రాష్ట్రాలతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక, మణిపూర్, సింధి రాష్ట్రాలలో కూడా ఘనంగా చేసుకుంటారు.

చాంద్రమానం ప్రకారం చైత్ర మాసంతో ప్రారంభమై ఫాల్గుణమాసం పూర్తయ్యే సంవత్సరానికి మొదలు ఈ రోజు చంద్రుడు వివిధ నక్షత్రాలలో సంచరించే స్థితిని బట్టి దీనిని చాంద్రమానం అంటారు. 'ఉగం అంటే నక్షత్ర గమనం ప్రకారం ఏడాదిని 'ఉంగం' గాను దాని తొలి దినాన్ని 'ఉగాది' గాను వ్యవహరిస్తారు. అదే విధంగా రెండు ఆయనాలు ఉన్న సంవత్సరం "యుగం" అంటారు. తెలుగు వారి నమ్మకం ఏమిటంటే ఈ ఉగాది రోజున బ్రహ్మసృష్టిని ప్రారంభించాడని అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు ఈ పండుగని. ఈ రోజున ప్రాతః కాలమున లేచి లోగిళ్ళని శుభ్రపరచుకుని రంగవల్లులు తీర్చిదిద్ది మామిడి తోరణాలతో అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దుతారు. అందరూ తలస్నానం చేస్తారు. తలకి నూనె రాసుకుని తల స్నానం చేయడంలో ఆంతర్యం ఏమిటో చూడండి. పర్వదినాల్లో తైలంలో లక్ష్మీదేవి, నీటిలో గంగాదేవి నివాసం ఉంటారు. అందుకే



పర్వదినాల్లో తలకు నూనె రాసుకుని తలస్నానం చేస్తే లక్ష్మీ, గంగా మాతల అనుగ్రహం ఉంటుందని పెద్దలు చెబుతారు.

తల స్నానం చేసి కొత్త బట్టలు ధరించి ఉగాది పచ్చడి తినడంతో దినచర్య ప్రారంభిస్తారు. షడ్రుచుల సమ్మేళనాలతో కూడిన ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకం. ఈ ఆరు రుచులలో మధురమైన 'తీపి' సంతోషానికి తిక్త అయిన 'చేదు' బాధకి, కటువుగా ఉండే 'కారం' కోపానికి, లవణంగా పిలువబడే 'ఉప్పు' భయానికి ఆమ్లాలు కలిగిన 'పులుపు' చిరాకుకు, కషాయం లాంటి 'వగరు' ఆశ్చర్యానికి గుర్తుగా భావిస్తారు. ఇలా ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తెలుగు వారికి ప్రత్యేకం. మనకి సంవత్సరం పొడవునా ఎదురయ్యే మంచి- చెడులను కష్ట-సుఖాలను సమానంగా స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి తెలియజేస్తుంది. ఈ పచ్చడి కోసం చెరకు, అరటి పళ్ళు, మామిడి కాయలు, వేప పువ్వు, చింతపండు, జామకాయలు, బెల్లం... మొదలగునవి వాడతారు.

ఈ రోజున జగమంతటికీ తల్లిదండ్రులైన శివపార్వతుల్ని దర్శిస్తే చాలా మంచిది. గోపూజ, ఎద్దు పూజలు కూడా చేస్తారు. గోవులకు ప్రదక్షిణ చేస్తే విశిష్టమైన ఫలితం కలుగుతుంది. ఈ రోజున పంచాంగాన్ని పూజా మందిరంలో పెట్టి పూజ చేయాలి. పంచాంగం అంటే అయిదు అంగములు కలిగినది అని అర్థం. అవి "తిథి, వార, నక్షత్ర, కరణ, యోగములు". ఈ పంచాంగంలో సంవత్సర కాలాన్ని ప్రమాణం చేసుకొని గ్రహాల కనుగుణంగా శుభ, అశుభ ఫలితాలు ఎలా ఉంటాయి, రాజపూజ్యము అవమానము ఎంతమేర ఉంటుంది అనే విషయాలన్ని వారివారి రాశుల ఆధారంగా చాలా వివరంగా తెలియ చేయబడతాయి. మనం భగవంతుని మనస్ఫూర్తిగా ఆరాధిస్తే ఆయన అనుగ్రహించి తీవ్ర ఫలితాలను ఇవ్వకుండా కరుణాకటాక్షాలను చూపుతాడు. అలాగే పంచాంగాన్ని పండగ రోజున మాత్రమే కాకుండా ఐదింటిని అంటే 'తిథి, వార, నక్షత్ర, కరణ, యోగాల్ని' ప్రతిరోజు పరిశీలన చేస్తే 'సంపద, దీర్ఘాయువు, ఆరోగ్యము, విజయము, పాపనాశనం' ఈ ఐదు సంప్రాప్తిస్తాయి. పంచాంగంలోని ఫలితాలను చదువుకొని కలిసొచ్చే కాలం అయితే ఏ విధమైన అహం కృతిని పొందకుండా దానిని భగవంతుని లీలగా భావించి సమతుల్యమైన బుద్ధితో వుండాలి. ఒకవేళ ఏదైనా ఉపద్రవం పొంచివుందని పంచాంగంలో చెబితే ఏ మాత్రం దిగులు చెందకుండా భగవంతుని పూజిస్తే మన బాధలు తొలగిపోతాయి.

అలాగే ఈ ఉగాదిని ప్రతి సంవత్సరం జరుపుకుంటాము. ఒక్కో సంవత్సరాన్ని ఒక్కో పేరుతో పిలుస్తారు. ఈ పేర్లు రావడం వెనుక కూడా ఓ చిన్న కథ ఉంది. శ్రీకృష్ణుని భార్యలలో ఒకరైన "సుదీపని" అని అనే రాజకుమారికి అరవై మంది సంతానం. వారి పేర్లనే ఈ తెలుగు సంవత్సరాలకి పెట్టారని పురాణాలు చెబుతున్నాయి. ఈ పేర్లు శాశ్వతంగా నిలిచిపోతాయి అని పరమేశ్వరుడు వరం ఇవ్వడంతో ప్రతి యుగానికి ఇవే పేర్లు వస్తున్నాయి. ఈ ఏడాది ఉగాది పేరు శోభకృతు నామ సంవత్సరం. ఈ శోభకృతు నామ సంవత్సరం ప్రారంభం నుంచే మనకి ఉన్న కష్టాలు, బాధలు పూర్తిగా తగ్గిపోయి శుభప్రదంగా అందరి జీవితాలు సాగిపోతూ అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారు.

"మామిడి పూత వచ్చింది" కోకిల గొంతుకి కూత వచ్చింది, వేపపువ్వు కొమ్మకి పూత వచ్చింది, గుమ్మానికి పచ్చని తోరణాలు వచ్చాయి, శుభం పలుకుతూ శోభకృతు నామ సంవత్సరం మన ముంగిట్లోకి వచ్చింది.... " అంటూ ఇలా ఎన్నో అందమైన కవితలకి జీవంపోస్తు 'శో భక్రుతు' నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆనందోత్సాహాలతో జరుపుకునే ఈ ఉగాది పండుగ అరుణోదయ కాంతులతో, ప్రకృతిమాత పిల్లగాలుల హొయలతో, వసంత మాసపు కోయిలమ్మ అందమైన కుహు రాగాలతో అడుగిడుతున్న శోభకృతు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ... శ్రేయోభిలాషులందరికి శోభకృతు నామ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు.



**- పింగళి భాగ్యలక్ష్మి,**
**గుంటూరు**
**కాలమిస్టు, రచయిత్రి (ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)**
**ఫోన్: 97047 25609**

# ప్రకృతి మార్పుతోనే ఉగాది పర్వదినం ప్రారంభం...

## శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రత్యేక కథనం

ప్రకృతి పరంగా సహజంగా మార్పే కొత్త సంవత్సరం ఉగాది పర్వదినమని అర్చకులు చెరుకు మహేశ్వర శర్మ తెలిపారు. బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆయన మాట్లాడుతూ....

**ఉగస్య ఆది ఉగాదిః**

"ఉగ" అనగా నక్షత్ర గమనం. నక్షత్ర గమనానికి 'ఆది' 'ఉగాది', అంటే సృష్టి ఆరంభమైన దినమే "ఉగాది". 'యుగము' అనగా ద్వయము లేక జంట అని కూడా అర్ధమని తెలిపారు. ఉత్తరాయణ, దక్షిణాయనములు అనబడే ఆయన ద్వయ సంయుతం యుగం" (సంవత్సరం) కాగా, ఆ యుగానికి ఆది (సంవత్సరాది) యుగాది అయింది యుగాది శబ్దానికి ప్రతిరూపమైన ఉగాదిగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

**తత్ర చైత్ర శుక్ల ప్రతిపది సంవత్సరారంభః:**

చైత్రశుద్ధ పాడ్యమి నాడు సంవత్సరాది 'ఉగాది' గా ఆచరణీయమని నిర్ణయసింధు గ్రంథం లో పేర్కొన్నారు. శిశిరం రాలిన ఆకుల తో కనిపించే చెట్లు ఉగాదితో కొత్త ఆకులతో చిగురులు వేసి కని పిస్తాయి. నదీనదాలు కొత్త నీటికై ఎదురు చూస్తుంటాయి. సూర్యుడు మేషరాశి లోకి ప్రవేశిస్తాడు. వసంతఋతువు ఆగమనం తో పుడమి తల్లి పులకరిస్తుందని చెరుకు మహేశ్వర శర్మ వివరించారు.

**ఉగాది పుట్టుపూర్వోత్తరాలు:**

వేదాలను హరించిన సోమకుని వధించి మత్స్యావతారధారియైన విష్ణువు వేదాలను బ్రహ్మకు అప్పగించిన శుభతరుణ పురస్కారంగా విష్ణువు ప్రీత్యర్థం 'ఉగాది' ఆచరణలోకి వచ్చెనని పురాణప్రతీతి. అనంతమైన కాలగమనాన్ని మన పూర్వీకులు అరవై సంవత్సరాలుగా విభజించి వాటికి ప్రభవ విభవ శుక్ల ప్రమోదూత ప్రజోత్పత్తి అంటూ అక్షయ నామ సంవత్సరం వరకు పేర్లు పెట్టారు. తెలుగు సంవత్సరాల పేర్లు వెనుక ఓ కథ ఉంది. నారద మహాముని ఓసారి విష్ణు మాయ వల్ల స్త్రీగా మారి, ఓ రాజును పెళ్లాడతాడు. వారికి 60 మంది సంతానం జన్మిస్తారు. ఓసారి ఆ రాజు తన సంతానంతో యుద్ధానికి వెళితే అంతా చనిపోతారు. అప్పుడు ప్రార్థించిన నారదుడిని విష్ణువు కరుణిస్తాడు. నీ పిల్లలు 60 సంవత్సరాలుగా కాలచక్రంలో తిరుగుతుంటారు అని వరమిస్తాడు. అవే మన తెలుగు సంవత్సరాలుగా ప్రస్తుతం వాడుకలో ఉన్నాయని తెలిపారు. వాటిలో శోభకృత్ నామ సంవత్సరం 37వదని అన్నారు. శోభకృత్ అనగా ప్రజలకు సుఖ సంతోషాలు చేకూర్చేది అని ఆయన అన్నారు.

చైత్రశుక్ల పాడ్యమి నాడు విశాలవిశ్వాన్ని బ్రహ్మదేవుడు సృష్టించెను కనుక సృష్టి ఆరంభించిన సంకేతంగా ఉగాది పర్వదినం చేస్తున్నారని అన్నారు. శాలివాహన చక్రవర్తి చైత్ర శుక్ల పాడ్యమి నాడే పట్టాభిషిక్తుడై తన శౌర్య పరాక్రమాలతో శాలివాహన యుగకర్తగా భాసిల్లిన కారణాన ఆ యోధాగ్రని స్మృత్యర్థం ఉగాది ఆచరిస్తున్నారని చారిత్రక వృత్తాంతం. ఏది ఏమైనా జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్ని రగుల్కొల్పి మానవాళిలో నూతనాశయాలను అంకురింపచేసే శుభదినం 'ఉగాది'.

ఉగాది పండుగ రోజున మనం చేయాల్సిన విధులను పండితులు సూచించారు. 'తైలాభ్యంగనం' అంటే నువ్వుల నూనెతో తలంటి పోసుకోవడం ప్రథమ విధి ఉగాది వంటి శుభదినాలలో సూర్యోదయానికి పూర్వమే మహాలక్ష్మి నూనెలోను, గంగాదేవి నీటిలోను, ఆవహించి వుండునని ఆర్యోక్తి. కావున నూనెతో తలంటుకుని అభ్యంగన స్నానం చేసినట్లైతే లక్ష్మి, గంగా మాతల అనుగ్రహాన్ని పొందగలుగుతారు.

**అభ్యంగంకారయొన్నిత్యం సర్వేష్వంగేషు పుష్టినం**


(అభ్యంగన స్నానం అన్ని అవయవాలకూ పుష్టిదాయకం) అనే ఆయుర్వేదోక్తి దృష్ట్యా అభ్యంగనం ఆరోగ్యం కూడా ఆరోగ్యరీత్యా ఆధ్యాత్మికరీత్యా తైలభ్యంగనానికి ఈబరీతిగా విశేష ప్రాధాన్యమీయ బడినదనూతన సంవత్సర స్తోత్రం. అభ్యంగ స్నానానంతరం సూర్యునికి, అర్ఘ్యదీపధూపాధి, పుణ్యకాలానుష్టానం ఆచరించిన పిదప మామిడి ఆకులతోరణాలతో, పూలతోరణాలతో దేవుని గదిలో మంటపాన్ని నిర్మించి, అందు నూతన సంవత్సర పంచాంగాన్ని, సంవత్సరాది దేవతను, ఇష్టదేవతారాధనతో బాటు పూజించి ఉగాది రసాయనాన్ని (ఉగాది పచ్చడి) నివేదించవలెను.

**నింబకుసుమ భక్షణం ఉగాడి పచ్చడి సేవనం**

ఉగాది నాటి ఆచారాలలో ఉగాది పచ్చడి సేపనం అత్యంత ప్రధానమైనది వేపపూత, కొత్త చింతపండు, బెల్లం లేక పంచదార లేక చెరకు ముక్కలు, నేయి, ఉప్పు, మిరియాలు, షడ్రుచులు మిళితమైన రసాయనాన్నే ఉగాడి పచ్చడి అంటాం!

**అబ్దాదౌ నింబకుసుమం శర్కరామ్ల ఘృతైర్యుతమ్**
**భక్షితం పూర్వయామేతు తద్వర్షే సౌఖ్య దాయకమ్**

అని ధర్మ సింధుగ్రంథం చెబుతున్నది. ఈ ఉగాది పచ్చడిని ఇంట్లో అందరూ పరగడుపున సేవించవలెను. ఉగాది నాడు ఉగాది పచ్చడి సేవించడం వల్ల సంవత్సరమంతా సౌఖ్యదాయకమని ఈ శ్లోక భావం. పలురుచుల మేళవింపు అయిన ఉగాది పచ్చడి కేవలం రుచికరమే కాదు ప్రభోదాత్మకం కూడా! "తీపి వెనుక చేదు, పులుపూ



అర్చకులు చెరుకు మహేశ్వర శర్మ

ఇలా పలురుచులకు జీవితాన కష్టాలు, తదితర అనుభూతులు, ప్రతీకలే అనే నగ్న సత్యాన్ని చాటుతూ సుఖాలకు పొంగకు, దు:ఖానికి క్రుంగకు, సుఖదు:ఖాలను సమభావంతో స్వీకరించు" అనే ప్రగతిశీల సందేశాన్నిస్తుందీ ఉగాది పచ్చడి. అంతేగాక ఈ పచ్చడి సేవన ఫలంగా వివిధ అనారోగ్య స్థితులు పరిహరించబడి, రోగశాంతి, ఆరోగ్యపుష్టి చేకూరుట గమనార్హం.

ప్రతీతి పంచాంగ శ్రవణం తిధిర్వారంచనక్షత్రం యోగః కరణమేవచ పంచాంగమ్" తిథి, వార, నక్షత్ర, యోగ, కరణముల నెడి పంచ అంగాల సమన్వితం పంచాంగం. ఉగాది నాడు దేవాలయంలో గాని, గ్రామకూడలి ప్రదేశాల్లోగాని, పండితుల, సిద్ధాంతుల సమక్షంలో కందాయఫలాలు స్థూలంగా తెలుసుకొని తదనుగుణంగా సంవత్సరం పొడవునా నడచుకొనుటకు నాడే అంకురార్పణం గావించవలెనని చెప్పబడియున్నది.

ఉగాదినాటి పంచాంగ శ్రవణం వల్ల గంగానదిలో స్నానం చేస్తే అభించేటంత ఫలితం లభిస్తుంది ఉగాది నాడు పంచాంగశ్రవణం చేసేవారికి సూర్యుడు శౌర్యాన్ని, చంద్రుడు ఇంద్రసమాన వైభవాన్ని, కుజుడు శుభాన్ని, శని ఐశ్వర్యాన్ని, రాహువు బాహుబలాన్ని, కేతువు కులాధిక్యతను కలుగచేస్తారని చెప్పబడినది

శ్లో.. **శతాయు వజ్రదేహాయ సర్వసంపత్ కరాయచ**
**సర్వారిష్ట వినాశాయ నింబకం దళబక్షణం**

ఉగాదినాడు ఈ శ్లోకమును చదివి ఉగాదిపచ్చడి ని తీసుకోవాలి బ్రహ్మ ప్రళయం' పూర్తి అయిన తరువాత తిరిగి సృష్టి ప్రారంభించుసమయాన్ని 'బ్రహ్మకల్పం' అంటారు. ఇలా ప్రతికల్పంలోను మొదటవచ్చే యుగాదిని యుగానికి ఆదిగా, ప్రారంభ సమయమును "ఉగాది" అని వ్యవహరిస్తూ ఉంటారు. అలాగునే ఈ 'ఉగాది' పర్వదినం మనకు చైత్రమాసంలో ప్రారంభమవడం వల్ల ఆరోజు నుండి మన తెలుగు సంవత్సర ఆరంభ దినంగా పరిగణించి, లెక్కించుటకు వీలుగా ఉండేందుకే ఉగాది పండుగను మనకు ఋషిపుంగవులు ఏర్పాటు చేశారు. లక్ష్మీప్రాప్తికి, విజయసాధనకు చైతన్యం కావాలి. జీవునకు చైతన్యం కలిగించేది కాలం. ముఖ్యంగా ఉగాది సమయం గంటలు, రోజులు, వారాలు, పక్షాలు, నెలలు, ఋతువులు, ప్రాణులు కాలస్వరూపమైన సంవత్సరంలో నివసిస్తున్నాయి.

**తృట్యైనమః, నిమేషాయనమః, కాలాయనమః**

అంటూ ప్రకృతిని, ప్రకృతికి కారణమైన శక్తిని ఆరాధిస్తాము. ఉగాది నాటి పంచాంగం పూజ, పంచాంగం శ్రవణం కాలస్వరూప నామార్చనకు ప్రతీకం. పంచాంగ పూజ, దేవి పూజ సదృశమైంది. అంతం, ముసలితనం, మరణం లేనిది కాలస్వరూపం. అదే దేవిస్వరూపం. అందుకే పంచాంగం పూజ, పంచాంగ శ్రవణం, దేవిపూజ ఫలాన్ని ప్రసాదిస్తుంది. విక్రమార్కుడు పట్టాభిషిక్తుడైన శుభదినం చైత్ర శుద్ధ పాడ్యమి. ఆనాడే విక్రమార్క శకం ప్రారంభమైంది. శకులపై శాలివాహనులు సాధించిన ఘన విజయం ఉగాది పచ్చడిలోని తీపికి, యుద్ధంలో కలిగిన కష్టనష్టాలు చేదుకు, శత్రువులను తమలో ఒకరుగా కలుపుకోవడంలో వచ్చిన మంచి చెడ్డలు పులుపునకు చిహ్నంగా మన పూర్వీకులు భావించి స్వీకరించారు. ఈ మూడింటి కలయికకు గుర్తుగా ఆనవాలుగా విక్రమాదిత్యుని కాలంలో శాలివాహన శకారంభం నుండి ఉగాది పచ్చడి ఆస్వాదించడం ఆచారమైందని చారిత్రకుల నిర్ణయం.

ఉగాది పండుగ ప్రత్యేకత 'ఉగాది పచ్చడి'. ఈ పచ్చడిలో చేరే పదార్థాలలో వేప పువ్వు ముఖ్యమైనది. బెల్లం, కొత్త చింతపండు పులుసు, మామిడి ముక్కలు, కొన్ని ప్రాంతాలలో అరటిపళ్ళ గుజ్జు కూడా చేర్చి పచ్చడిగా తయారుచేస్తారు. తీపి, ఉప్పు, పులుపు, చేదు, వగరు, కారం అనే షడ్రుచుల సమ్మేళనంగా జీవితంలో కష్టసుఖాలు ఆనంద విషాదాలుగా కలగలిసి ఉంటాయని చెప్పడానికి ప్రతీకగా దీన్ని అందరూ సేవిస్తారు. ఆరోగ్యానికి ఇది మంచిది. అంతే కాకుండా అంతర్గతంగా ఆరోగ్య సూత్రం ఇమిడి ఉందని తెలుపుతోంది. మామిడాకుల తోరణాలు కట్టడం, తలస్నానం చెయ్యడం, కొత్తబట్టలు ధరించడం, పిండి వంటలు చేయడం పూర్వం నుంచీ వస్తున్న ఆచారం. ఆదాయ వ్యయాలు, రాజ పూజ్య అవమానాలు, కందాయ ఫలాలు, రాశి ఫలాలు తెలియజెప్పే పంచాంగం వినటం ఆనవాయితి. పల్లెల్లో రైతులు ఉగాది రోజున అక్కడి దేవాలయం వద్ద అంతా చేరి, పురోహితుడిని రప్పించి, తమ వ్యవసాయానికి ఏ కార్తెలో వర్షం పడుతుంది? గ్రహణాలు ఏమైనా ఉన్నాయా? ఏరువాక ఎప్పుడు సాగాలి? వంటివన్నీ అడిగి తెలుసుకుంటారు.

**పంచాంగ శ్రవణం:**

నిత్య వ్యవహారాలకోసం ఈనాడు అందరూ ఇంగ్లీషు క్యాలెండర్ అయిన "గ్రిగేరియన్ క్యాలెండరు"ను ఉపయోగిస్తూ వున్నా శుభ కార్యాలు, పూజా పునస్కారాలు, పితృదేవతారాధన, వంటి విషయాలకు వచ్చేటప్పటికి "పంచాంగము" ను ఉపయోగించడం మన పంచాంగ విశిష్టతకు నిదర్శనం. ఈ పంచాంగం ఉగాదితో అమల్లోకి వచ్చి, మళ్ళీ సంవత్సరం ఉగాది ముందురోజు వరకు అమలులో ఉంటుంది. అటువంటి పంచాంగమును ఉగాదినాడు వివిధ దేవతలతోపాటు పూజించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. అంతేకాకుండా 'పంచాంగ శ్రవణం' ఉగాధి విధుల్లో ఒకటి. ఈనాడు గ్రామాలు మొదలుకొని పెద్ద పెద్ద నగరాల వరకూ అన్నిచోట్లా పంచాంగ శ్రవణం నిర్వహించడం చూస్తూనే ఉన్నాము. కాగా ప్రస్తుతం పంచాంగాలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఇలా పూర్వం లభించేవి కాదు. తాటాకుల మీద వ్రాయబడేవి కనుక పండితులవద్ద మాత్రమే ఉండేవి. కనుక వారు ఉగాదినాడు సంవత్సర ఫలాలను అందరికీ తెలియజేస్తారు. ఈ విధముగా పంచాంగ శ్రవణం ఆచారమైనట్లు పండితుల అభిప్రాయం. "పంచాంగం" అంటే అయిదు అంగములు అని అర్థం. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం. అనేవి ఆ అయిదు అంగాలు. పాడ్యమి మొదలుకొని 15 తిథులు, 7వారాలు, అశ్వని మొదలుకొని రేవతి వరకు 27 నక్షత్రములు, విష్కభం మొదలుకొని వైధృతి వరకు 27 యోగములు, బవ మొదలుకొని కింస్తుఘ్నం వరకు, 11 కరణములు వున్నాయి. వీటన్నిటినీ తెలిపేదే "పంచాంగం". పంచాంగ శ్రవణం చేసే సమయంలో ఉత్తరాభిముఖంగా కూర్చుని పంచాంగం వింటే మంచిదని పండితుల అభిప్రాయం. పంచాంగ శ్రవణంలో ప్రధానంగా ఆ సంవత్సర ఫలితాలను వివరిస్తారు అంటే నవనాయకులను తెలుసుకుని వారిద్వారా ఫలాలను అంచనా వేస్తారు. సంవత్సరంలో ఏఏ గ్రహాలకు ఏఏ అధికారం లభిస్తుందో తెలుసుకుంటారు. ఆ గ్రహాలే ఆ సంవత్సర నవనాయకులు. వీరికి లభించే అధికారాన్ని బట్టి ఆ సంవత్సర ఫలితాలు ఉంటాయని చెరుకు మహేశ్వర శర్మ వివరించారు.

# ఢిల్లీ బడ్జెట్‌కు కేంద్రం ఆమోదం

**బడ్జెట్ ఆపవద్దంటూ కేజ్రీవాల్ వినతి**

**న్యూఢిల్లీ,మార్చి21(ప్రజామంటలు):** ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌కు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈబడ్జెట్‌ను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్



వీకే సక్సేనా పరిశీలించిన తర్వాత తనకు మళ్లీ సమర్పించాలని అంతకుముందు ఎంహెచ్ఏ కోరిన సంగతి తెలిసిందే. ఢిల్లీ శాసన సభలో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఒక రోజు ముందు బడ్జెట్‌ను ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం ఆపేసిందని కేజ్రీవాల్ ఆరోపించిన సంగతి తెలిసిందే. అనంతరం ఎంహెచ్ఏ సోమవారం స్పందిస్తూ, ప్రతిపాదిత బ్జడెట్‌పై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కొన్ని పరిపాలనపరమైన అంశాలను లేవనెత్తారని తెలిపింది. దేశ రాజధాని నగరం ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ అంశాలను లేవనెత్తారని పేర్కొంది. ఈ అంశాలను పరిష్కరించి బడ్జెట్‌ను తిరిగి పంపించాలని మార్చి 17న రాసిన లేఖలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొంది. కేజ్రీవాల్ మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖలో రాష్ట్ర బ్జడెట్‌కు ఆమోదం తెలపకుండా నిలిపివేయవద్దని కోరారు. 75 ఏళ్ళ స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఓ రాష్ట్ర బ్జడెట్‌కు ఆమోదం తెలపకపోవడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. మా ఢిల్లీ ప్రజలపై మీకెందుకంత కోపం అని ప్రశ్నించారు. ఈ బ్జడెట్‌ను ఆమోదించాలని ఢిల్లీ ప్రజలు చేతులెత్తి మొక్కుతున్నారని పేర్కొన్నారు.

# పేపర్ లీకులు సర్వసాధారణం

**మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వ్యాఖ్య : మండిపడుతున్న నిరుద్యోగులు**

**హైదరాబాద్,మార్చి21(ప్రజామంటలు):** క్వశ్చన్ పేపర్ లీకులు సర్వ సాధారణం అని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వ్యాఖ్యానించారు. టెన్త్ నుంచి అన్ని పేపర్లు లీక్ చాలా కామన్ అంటూ మాట్లాడారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ల లీకుల విషయంలో ప్రతిపక్ష నాయకులు మంత్రి కేటీఆర్ ను దోషి అనడం కరెక్టు కాదన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డిని సిట్ ఆధారాలు అడిగితే తప్పేంటి..? అని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఏం మాట్లాడుతారో ఆయనకే తెలియదన్నారు. లీకుల విషయంలో ప్రతిపక్ష నాయకులు ఆధారాలు లేకుండా మాట్లాడితే ఎలా అని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రశ్నించారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం మంత్రి కేటీఆర్.. తాజాగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి లీకుల విషయాన్ని చాలా తేలిగ్గా తీసుకుని మాట్లాడుతున్నా రంటూ నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేపర్స్ లీకుల విషయాన్ని మంత్రులు చాలా లైట్‌గా తీసుకున్నట్లు కనిపిస్తోందని చెబుతున్నారు. లీకులు కామన్ అయినప్పుడు కోచింగ్ సెంటర్లలో వేలకు వేలు ఖర్చు పెట్టి.. రాత్రింబవళ్లు కష్టపడి చదవడం ఎందుకు అని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్ష నేతల ఆరోపణలకు సరైన సమాధానాలు ఇవ్వకుండా.. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

పేపర్ల లీకేజీ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం లైట్ తీసుకున్నప్పుడు అరెస్ట్ లు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. రెండు రోజుల క్రితం మంత్రి కేటీఆర్ కూడా ప్రెస్ మీట్ పెట్టినప్పుడు తన ఐటీశాఖకు లీకేజీ వ్యవహారంలో ఏం సంబంధం అని ప్రశ్నించారని నిరుద్యోగులు గుర్తుచేస్తున్నారు. ఈ కేసులో ఇద్దరు మాత్రమే ఉన్నారని కేటీఆర్ అన్నప్పుడు.. ఇప్పుడు జరుగుతున్న సిట్ విచారణ ఎందుకని ప్రశ్నిస్తున్నారు. మంత్రి కేటీఆర్ ఆఫీసు నుంచే లీకులు జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపణలు చేసినప్పుడు సిట్ కూడా ఆ కోణంలో విచారణ ఎందుకు చేయడం లేదని నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు, విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు.. లీకుల వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వాన్ని కుదిపేస్తోంది. ఇప్పటి వరకూ ఎన్ని పేపర్లు లీకయ్యాయో...? ఇంకా తెలియడం లేదు. దీనిపై గందరగోళం నెలకొంది. తవ్వేకొద్దీ కొత్త కొత్త విషయాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్న సంకల్పంతో రాత్రింబవళ్లు కష్టపడి చదువుకున్న వాళ్ల శ్రమ ఏంటో తెలియకుండా మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడుతారా..? అని నిరుద్యోగులు మండిపడు తున్నారు. ఇది ప్రభుత్వ విధానామా..? లేక ఇంద్రకరణ్ రెడ్డి పర్సనల్ వెర్షనా...? అని ప్రశ్నిస్తున్నారు. సిట్ విచారణ జరుగుతున్న సమయంలో ఇంద్రకరణ్ రెడ్డి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

# తెలంగాణపై కక్ష కట్టిన కేంద్రం, గవర్నర్

**తెలంగాణపై ప్రేమ ఉంటే బిల్లులను ఆమోదించాలి**

**యువతకు ఉగాది తీపి కబురు అందించాలి**

**మహిళా మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ వినతి**

**హైదరాబాద్,మార్చి21(ప్రజామంటలు):** గవర్నర్‌కు తమిళిసైకి తెలంగాణ యువత పట్ల ప్రేమ ఉంటే తొక్కి పెట్టిన కొలువుల బిల్లులపై వెంటనే సంతకం చేయాలని తెలంగాణ మహిళా మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ కోరారు. తెలంగాణ యువత ఎదుర్కొంటున్న సవాళ్లకు కేంద్ర ప్రభుత్వం, హైదరాబాద్ లోని రాజ్‌భవనే కారణమని గవర్నర్ తెలుసుకోవాలని ఆమెకు మంత్రులు సూచించారు. గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణ మహిళా మంత్రులు సబిత ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ లేఖ రాశారు. ఈ ఉగాది పండుగ సందర్భంగా యువత ఎదుర్కొంటున్న చేదును దాటి, తీపి రోజులు వచ్చేలా కేంద్ర ప్రభుత్వ వివక్షపైన గవర్నర్ స్పందించాలన్నారు. తెలంగాణ యువత ఉద్యోగ, ఉపాధి, విద్య అవకాశాలపైన వివక్షపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపైన గవర్నర్ గళమెత్తాలని మంత్రులు సూచించారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాలతో తమకు జరుగుతున్న నష్టాన్ని ప్రజలు గమనిస్తున్నారు. యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును తొక్కిపెట్టిన విషయం మరిచిపోయినట్లు ఉన్నారు. ఛాలెంజ్‌లను స్వీకరించేందుకు రాజ్‌భవన్ సిద్ధంగా ఉంటే కేంద్రం వైఖరిపై మాతో కలిసిరండి. యువతకు రాజ్‌భవన్ అండగా



ఉంటుందన్న భరోసా నిజమే అయితే కేంద్రం అన్యాయలను కూడా అడ్డుకోండి. ఈ ప్రక్రియలో మాతో కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తూ.. గవర్నర్‌కు మహిళా మంత్రులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు అమలయ్యేలా సీఎం కేసీఆర్ నాయకత్వం లో ముందుకెళున్నాం. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసుకుంటున్నాం. 22 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా పారిశ్రామిక విధానాన్ని తీర్చిదిద్ది పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చుకున్నాం. ఐటీ రంగంలో దేశానికే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాం అని మహిళా మంత్రులు పేర్కొన్నారు. కేంద్రం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బకొడుతూ విద్యాసంస్థల్లోనూ అన్యాయం చేస్తుందని మంత్రులు మండిపడ్డారు. రాష్ట్రానికి ఒక్క నవోదయ పాఠశాల, ఒక్క మెడికల్ కాలేజీని కూడా కేటాయించలేదు. ఉపాధి అవకాశాలను కల్పించే విభజన చట్టం హామీలను కేంద్రం పక్కన పెట్టింది. తెలంగాణ యువత ఎదుర్కొంటున్న సవాళ్లకు మీరు కూడా ప్రత్యక్ష కారణం.

## పోషణ పక్షంను పకడ్బందీగా నిర్వహించాలి


**కోరుట్ల మార్చి 21 (ప్రజామంటలు):** కోరుట్ల మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషక అభిమాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని అంగన్ వాడి కేంద్రాల్లో పోషక పక్షం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అంగన్ వాడి సూపర్ వైజర్ కాసుల హేమలత అన్నారు.. మంగళవారం పట్టణంలోని 8, 9, 10, 11వ వార్డుల లోని అంగన్ వాడి కేంద్రాల్లో పోషకపక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ



సందర్భంగా సూపర్ వైజర్ హేమలత మాట్లాడుతూ పిల్ల తల్లులు, గర్భిణీలు 0 నుంచి 15 సంవత్సరాల ఆడపిల్లలు తీసుకోవాల్సిన పోషక పదార్థాలు ,ఆహార పదార్థాల గురించి అవగాహన కల్పించారు.. పుట్టిన బిడ్డకు మర్రుపాలు త్రాగించడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని, బాలికలు కచ్చితంగా పోషక పదార్థాలను ఎక్కువ మోతాదులో తీసుకోవాలని సూచించారు. పిల్లలు, మహిళల్లో, బాలికల్లో పోషక విలువలు పెంచడానికి చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.. పిల్లల్లో, మహిళల్లో పోషకాల నివారించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దాసరి సునీత, అంగన్ వాడి టీచర్లు, పిల్ల తల్లులు గర్భిణీలు, బాలింతలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లకు పేస్కేల్ అమలు చేయాలి

**జగిత్యాల ప్రతినిధి మార్చి 21 (ప్రజామంటలు):** సెర్ఫ్ ఉద్యోగుల మాదిరిగానే ఉపాదీహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ ఫీల్డ్ అసిస్టెంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు



గడ్డం రమేష్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఫీల్డ్ అసిస్టెంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. సుమారు గత 16 సంవత్సరాలుగా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పేద కూలీలకు అవసరమైన పనులు కల్పించి వలసలను అరికట్టామని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో నిరంతరం కష్టపడి పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం గుర్తించి ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లు పేస్కేల్ అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు పొన్నం రాజు గౌడ్, కేర్ శ్రీనివాస్, కొలిపాక రాజు, తోట్ల శంకర్, లక్ష్మణ్, రాజు, వివిధ మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### అకాల వర్షాలతో నష్టపోయిన రైతన్నలు
### ఆదుకోవాలని కోరుతూ అదనపు కలెక్టర్ కు మెమోరాండం

**జగిత్యాల మార్చి 21 (ప్రజామంటలు):** వడగండ్ల వానలతో తీవ్రంగా నష్టపోయిన రైతన్నలను వెంటనే ఆదుకోవాలి వెంటనే సర్వే చేపట్టి ఎకరానికి 50000/- రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పంటలను పరిశీలించి నష్టపోయిన



రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బి.సి. సంక్షేమ సంఘం జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపురం రాంచందర్, బి.సి. సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దీటి వెంకటేష్, బి.సి. సంక్షేమ సంఘం జగిత్యాల మండల అధ్యక్షుడు బందెల మల్లయ్య, జగిత్యాల బి.సి. సంక్షేమ సంఘం గొల్లపల్లి మండల అధ్యక్షుడు భీమ సంతోష్, బి.సి. సంక్షేమ సంఘం జగిత్యాల నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చిరుపుల్ల మల్లేష్ యాదవ్, మరియు బి.సి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి బిల్డింగ్ బ్లాక్స్ ప్లే స్కూల్‌లో ముందస్తు ఉగాది వేడుకలు

**జగిత్యాల మార్చి 21( ప్రజామంటలు):** జగిత్యాల పట్టణం లోని జ్యోతి బిల్డింగ్ బ్లాక్స్ ప్లే స్కూల్ లో ముందస్తుగా ఉగాది వేడుకలు నిర్వహించి " శోభకృత నామ




సంవత్సరానికి " ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఉగాది పచ్చడి" ఈ పండుగకు ప్రత్యేకమైంది. షడ్రుచుల సమ్మేళనం – తీపి (మధురం), పులుపు (ఆమ్లం), ఉప్పు (లవణం), కారం (కటు), చేదు (తిక్త), వగరు (కషాయం) అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది.అని అన్నారు . విద్యార్థులకి ఉగాది పచ్చడి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మనువాదాన్ని మట్టుబెట్టాలి, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

**జనగామ మార్చి 20 (ప్రజామంటలు):** మనస్మృతి ప్రాచీన భారత రాజ్యాంగం అంటూ ఆర్ఎస్ఎస్ మనువాదులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని దేశంలో అన్ని రకాల సమానతలకు మూలమైన మనస్మృతి మనువాదాన్ని మట్టిలో పాతిపెట్టాలని చట్టం ముందు అందరూ సమానులే అని ప్రకటించిన భారత రాజ్యాంగాన్ని ఐక్యంగా రక్షించుకోవాలని (డిహెచ్పిఎస్) రాష్ట్ర నాయకులు మారుపాక అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం జనగామ జిల్లా దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్పిఎస్) జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మారుపాక అనిల్ కుమార్ హాజరై మాట్లాడుతూ.... మనుషులను ముక్కలు చేసే దేశం వెనుకబాటు తనానికి మనుస్మృతి ప్రధాన కారణం అన్నారు. అలాంటి మధ్యయుగాల కాలం నాటి మనుస్మృతిని ఆర్ఎస్ఎస్ బీజేపీ తిరిగి ప్రాచీన రాజ్యాంగమని ప్రకటించడాన్ని ప్రతీ ఒక్కరు ఖండి%శీ% చాలన్నారు. మనువాదులకు మతోన్మాదులకు మనుస్మృతి రాజ్యాంగమయితే వాళ్ళు ఈ దేశంలో




పౌరులు ఎలా అవుతారని విమర్శించారు. భారతీయులందరికీ భారత రాజ్యాంగమే శిరోధార్యం అన్నారు. రాజ్యాంగం రద్దుకు ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు చేస్తున్న కుట్రలో భాగమే మను సంస్కృతి పేరుతో నాటకాలాడుతున్నారని చెప్పారు. మెజార్టీ ప్రజలకు చదువు సంపదలు దూరం చేసినమనుస్మృతి ఈ దేశ ప్రజలందరికీ ప్రధాన శత్రువు అన్నారు. కుల అసమానతలు సృష్టించిన మనుస్మృతి ఆర్ఎస్ఎస్ బీజేపీ వారికి పవిత్ర గ్రంథం అయితే భారత రాజ్యాంగం భారతీయుల పవిత్ర గ్రంథం అది వర్ధిల్లాలని చెప్పారు. రాజ్యాంగ రక్షణకు భారతీయులందరం ఐక్యం కావాలన్నారు. మనువాదులకు బుద్ధి చెబుదాం రాజ్యాంగం రక్షణ కోసం అభ్యుదయ శక్తులారా ఐక్యమవుద్దామనన్నారు. భారత ప్రజాస్వామిక రాజ్యాంగ హక్కుల ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజల దుర్భరమైన జీవితాల నుండి కొంత అభివృద్ధి సాధించటం జరిగిందన్నారు. ఈ అభివృద్ధిని చూసి తట్టుకోలేని ఆర్ఎస్ఎస్ మత చాందసవాదులు రాజ్యాంగానికి నష్టం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు దీనిపై అన్ని ప్రజా సంఘాలు మేధావులు ప్రజలందరూ ఏకమై తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి ( డిహెచ్ పిఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభలు మార్చి 31న ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా జరగనున్నాయని, ఈ మహాసభల్లో దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దళిత, ఆదివాసి, గిరిజనలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా రాజ్యాంగబద్ధంగా దళితులకు రావలసిన బడ్జెట్లో వాటపై, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ తో పాటు ఇతర అంశాల పట్ల మహాసభలు కార్యక్రమా రూపొందించుకొని భవిష్యత్తు ఉద్యమాల కార్యచరణకు పూనుకుంటామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆకుల శ్రీనివాస్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి, మంగళపల్లి జనార్ధన్, జువారి రమేష్, రడపాక సత్యం, పైసా రాములు, చడా ఎల్లయ్య, పిట్టల కుమార్, జీడి ఎల్లయ్య, రడపాక భాగ్యమ్మ, సోమయ్య ,ఎల్లయ్య, నరసయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పారి వెంకటస్వామి సేవలు శ్లాఘనీయం

**జనగామ మార్చి 20 (ప్రజామంటలు):** ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమమే ధ్యేయంగా తమ ఉద్యోగాన్ని సైతం వదులుకుని అనేక సౌకర్యాలు నేడు పొందేలా కృషిచేసిన అప్పారి వెంకటస్వామి సేవలు శ్లాఘనీయమని టిఎస్యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రావు అన్నారు. జనగామ జిల్లా కేంద్రములోని రైల్వేస్టేషన్ పాఠశాలలో యుటిఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమం ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.... ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక ప్రాతినిధ్యాలు, పోరాటలు చేసిన న ఫలితంగా నేడు సౌకర్యాలు అనుభవిస్తున్నారని, అన్ని మేనేజ్ మెంట్ల సమస్యలను తమ సమస్యలుగా



భావించి పోరాటాలు చేసిందని, ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయుల అనేక సమస్యలతో సతమతమయ్యేవారని సరైన వేతనాలు లేక కనీస సౌకర్యాలు లేక, పెన్షన్ సౌకర్యం లేని సందర్భంలో ఉపాధ్యాయుల సమస్యలను తన సమస్యలుగా భావించి 10 సం. సర్వీస్ సైతం సంఘం విస్తరణ కొరకు, ఉపాధ్యాయుల సేవార్థం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని అలాంటివారు ఆదర్శప్రాయులని వారి బాటలో నడుస్తూ నీతి, నిజాయితీలతో, పైరవీలకు దూరంగా ఉండేలా సమాజలో ఉపాధ్యాయుల గౌరవాన్ని మరింత పెంచేలా టిఎస్ యుటిఎఫ్ పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాదూరి వెంకటేష్, వివిధ మండలాల బాధ్యులు గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, నవీన్, నర్సిహులు, నాగరాజు, శ్రీనివాస్, ఉప్పలయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత
## కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

**చిగురుమామిడి మార్చి 21 (ప్రజామంటలు):** వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం, సమగ్ర చట్టం తేవాలని భవిష్యత్ లో పోరాటాలు రూపొందించేందుకు ఈ నెల 26,27 తేదీలలో కరీంనగర్ తారక హోటల్ లో జరుగు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం చొప్పదండి మండల కేంద్రంలో కౌన్సిల్ సమావేశాల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ.... దేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను, కార్మికులను విస్మరిస్తున్నారని,కార్మిక చట్టాలను కాలరాసి పెట్టుబడిదారి వర్గాలకు, ఆదాని,




అంబానీలకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. దేశంలోని వ్యవసాయ కార్మికుల, ఉపాధి కూలీల సమస్యల పట్ల, వారి కుటుంబాల సంక్షేమం పట్ల శ్రద్ధ చూపడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వ భూములను ధనవంతులకు కట్టబెడుతుందని ఆరోపించారు. భవిష్యత్ లో వ్యవసాయ, ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాట కార్యచరణ రూపొందించేందుకు ఈ రాష్ట్ర విస్తృత కౌన్సిల్ సమావేశాలు దోహద పడతాయని అన్నారు. ఈ సమావేశాలకు జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని సృజన్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు లంక అంజయ్య, మచ్చ రమేష్, రంగు రమేష్ గౌడ్, నారాయణ, రవీందర్, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

### కోరుట్ల విశ్వశాంతి స్కూల్‌లో
## క్షయవ్యాధి అవగాహన సదస్సు

**కోరుట్ల మార్చి 21 (ప్రజామంటలు):** క్షయ వ్యాధి నివారణ దినోత్సవ సందర్భంగా అవగాహన సదస్సు స్థానిక విశ్వ శాంతి హై స్కూల్ జరిగినది. ఈ కార్యక్రమంలో కోరుట్ల



అర్బన్ క్షయ వ్యాధి నివారణ అధికారి ఆకుల మల్లికార్జున్ పాల్గొన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాల గురించి వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం ఇవన్నీ క్షయ వ్యాధి లక్షణాలు అని తెలిపారు.అలాంటి లక్షణాలు గల వారు ప్రభుత్వ దావాఖానకు వెళ్లి తెమడ (కళ్ళే) పరీక్షలు చేయించుకోవాలని



అన్నారు. ఈ పరిక్షలు పూర్తిగా ఉచితంగా చేస్తారని, వ్యాధి నిర్ధారణ జరిగితే చికిత్సకు మందులు కూడా ఉచితంగా ఇస్తారని, మందులు వాడే రోగులకు నెలకు 500 రూపాయల చొప్పున పౌష్టికాహారం కోసం ప్రభుత్వమే అందజేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బ్రహ్మన్న గారి శంకర్ శర్మ, కరస్పాండెంట్ సత్యం రావు, విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## జామమజీద్ అధ్యక్షులుగా మహమ్మద్ నబీ

**భీమదేవరపల్లి మార్చి 21 (ప్రజామంటలు):** మండలంలోని ముల్కనూర్ జామ మజీద్ అధ్యక్షులుగా మహ్మద్ నబి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మజీద్ ఆవరణలో జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఉపా ధ్యక్షులుగా హకీమ్ పాష, ఎండి. రాజ్ మహమ్మద్, కార్యదర్శిగా సయ్యద్ షౌకత్ పాషా, ఎండి సమీర్ పాషా, కోశాధికారిగా సాదిక్ పాషా, రషీద్, కార్యవర్గ సభ్యు ఓలుగా సయ్యద్ బాబా, మహమ్మద్ భాషా మియా, అప్సర్, రజాక్, బాబా, తకిల్ పాషాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నభీ



మాట్లాడుతూ మజీద్ అభివృద్ధిలో ముందు ఉంటూ, ముస్లింల ఐక్యత కోసం కృషి చేస్తానని అన్నారు.

## రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్**

**జగిత్యాల మార్చి 21 (ప్రజామంటలు):** జగిత్యాల నియోజక వర్గ, రాష్ట్ర ప్రజలకు మాజీ మంత్రి, ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరికి శుభాలు చేకూరాలని, ఉగాది పండగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణగా రూపుదిద్దు కుంటోందని, ఇప్పటికే సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలులో యావత్ దేశానికి తెలంగాణ మార్గదర్శంగా నిలుస్తోందని అన్నారు.



దినదినాభివృద్ధి సాధిస్తూ, దేశంలో అగ్రగామిగా వెలుగొందుతున్న తెలంగాణ రాష్ట్రం ప్రస్తుత శ్రీ శోభకృత్ నామ సంవత్సరం లో మరింత ప్రగతి సాధించాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖః సంతోషాలు, ఆనందోత్సాహాలతో ఉండాలని ఆకాంక్షించారు.

### అకాల వర్షానికి పంట నష్టపోయిన
## అన్నదాతలను ఆదుకోవాలి

**భీమదేవరపల్లి మార్చి 21 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకి జరిగిన పంట నష్టాన్ని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర మాజీ హౌజ్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, వరంగల్ జిల్లా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పుల్యాల రవీందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గండు సారయ్య,రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు పోల్నేని సుధాకర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వి రాజ్, ఎంపీటీసీ గోపి శర్మ నాయకులు మీస మహేష్, నోముల బిక్షపతి, బుర్ర రాజయ్య, ఉగ్గే తిరుపతి పాల్గొన్నారు.

## అంధ్వత్వ నివారణే కంటి వెలుగు లక్ష్యం

**మల్లాపూర్ మార్చి 21 (ప్రజా మంటలు):** మండలం లోని వేంకట్రావుపేట లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ



ఆవరణలో కంటి వెలుగు శిభిరంను గ్రామ సర్పంచ్ జోగుల మమత రాజేష్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.... 18 నుంచి పైబడి కంటి సమస్యతో ఉన్న వారందరూ కంటి శిభిరంలో .కంటి పరిక్షలు నిర్వహించుకోని తగిన అద్దాలు పోందాలనీ కోరారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి తోట సూజత శ్రీనివాస్, ఉపసర్పంచ్ రవి, క్యాంపు వైద్యధికారి రాహుల్ శర్మ, సూపర్ వైజర్ శ్రీనివాస్, అప్తమాలిస్ట్ బోడ రమేష్, డాట ఆపరేటర్ శివకుమార్, ఎఎన్ఎం కోమల, ఎంఎల్ హెచ్పి శైలజ, కార్యదర్శి సురేష్, అంగన్వాడీ టిచర్స్ సంధ్యారాణి, జమున, పద్మ ఆశలు రాణి, శారధ, స్రవంతి వసంత, రమా వార్డు మెంబర్స్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శించిన బోయినపల్లి వినోద్ కుమార్

**హుజూరాబాద్ మార్చి 21 (ప్రజా మంటలు):** హుజురాబాద్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అల్లి నరేందర్ తల్లి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా వారి



స్వగ్రామమైన కణుకులగిద్ద గ్రామంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, శాసనమండలి సభ్యులు ప్రభుత్వ విప్ కౌశిక్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ తదితరులుతో కలిసి పరామర్శించారు.

## హర్యానా గవర్నర్‌ను కలిసిన మాజీ మంత్రి శశిధర్ రెడ్డి

**సికింద్రాబాద్ మార్చి 21 (ప్రజామంటలు):** హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఎన్.డీ.ఎమ్.ఏ. మాజీ వైస్ ఛైర్మన్, మాజీ మంత్రి మర్రి శశిధర్



రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీ లోని హర్యానా భవన్ లో మంగళవారం తనను కలిసిన మర్రి శశిధర్ రెడ్డి ని బండారు దత్తాత్రేయ శాలువతో సత్కరించారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి అందరం సమష్టిగా కృషి చేసి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలని ఈ సందర్భంగా దత్తాత్రేయ సూచించారు. ముఖ్యంగా విద్యావేత్తలు, మేధావుల ఆలోచనలు తెలంగాణ అభివృద్ధి లో కీలకంగా నిలుస్తాయనే అభిప్రాయాన్ని గవర్నర్ దత్తాత్రేయ వ్యక్తం చేసినట్లు మర్రి శశిధర్ రెడ్డి ఫోన్లో మాట్లాడుతూ తెలిపారు. మర్రి శశిధర్ రెడ్డి వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

## భోలక్ పూర్ కృష్ణవేణి స్కూల్‌లో ఉగాది వేడుకలు

**సికింద్రాబాద్, మార్చి 21 ( ప్రజామంటలు ):** కొత్త తెలుగు సంవత్సరాది ఉగాది శ్రీ శోభాకృత్ నామ సంవత్సర పర్వదిన వేడుకలను మంగళవారం




భోలక్ పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో నిర్వహించారు. చిన్నారి విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం సాంప్రదాయ దుస్తులు ధరించి, పాఠశాలను మామిడి తోరణాలతో అలంకరించారు. పంచాంగ శ్రవణం చేసి, ఉగాది పచ్చడిని స్టూడెంట్స్కు తినిపించారు. చిన్నారులతో శ్లోకాలు, పద్యాలు చదివించి తెలుగు గొప్పదనాన్ని వివరించారు. ఈసందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ డా.మంచాల శ్రీనివాసులు మాట్లాడుతూ..విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాలు, ఉగాది విశిష్టతను తెలిపామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పరామర్శించిన బొమ్మ శ్రీ రామన్న

**ఎల్కతుర్తి మార్చి 21 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన బీజేవైఎం కార్యకర్త తంగళ్ళపల్లి కార్తీక్, మరియు ఎంజాల రామస్వామి, ఇటీవల మరణించిగా వారి కుటుంబ సభ్యులను



పరామర్శించిన బీజేపీ నాయకులు మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌస్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అనంతరం మృతికి గల వివరాలను తెలుసుకొని, వారి ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతుడు వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని అన్నారు, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కుడితడి చిరంజీవి ప్రధాన కార్యదర్శి కోరే కార్తీక్ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గోడిశాల వినయ్ నాయకులు ఎర్రగొల్ల శ్రీనివాస్ జనగాని కృష్ణయ్య దండ దేవేందర్ రెడ్డి పెరుగు మధుసూదన్ బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అంచనగిరి వెంకటరమణ కొమ్మిడి శ్రావణ్ రెడ్డి బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ టిపిలో చేరికలు

**జనగామ మార్చి 20 (ప్రజామంటలు):** జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం లో వైయస్సార్ తెలంగాణ పార్టీ లోకి వివిధ పార్టీల నుండి నియోజకవర్గ కోఆర్డినేటర్ సంఘాల యిర్మియా ఆధ్వర్యంలో చేరుతున్న వారికి జిల్లా అధ్యక్షులు గౌరబోయిన సమ్మయ్య పార్టీ కండువా కప్పి పార్టీలోకి



ఆహ్వానించారు. అనంతరం యిర్మియా మాట్లాడుతూ వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల ఆదేశాల మేరకు చిల్పూర్, స్టేషన్ ఘనపూర్ మండలాల్లో నూతన అధ్యక్షులను ప్రకటిస్తామని, ఈ రెండు మండలాల్లో గత 8 నెలల నుండి కమిటీల నిర్మాణం ఆలస్యం కావడంతో పాత కమిటీలు రద్దు చేసి మళ్ళీ కొత్త కమిటీలు త్వరలోనే పార్టీ అధిష్టానం మేరకు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షులు ఊరడి శ్రీనివాస్, రఘునాథపల్లి మండల అధ్యక్షులు మూసి పట్ల నరేష్ అర్జున్, మోహన్, హరీష్, శ్రీకాంత్, సమ్మయ్య, పాల్గొన్నారు.

# అలరించిన బ్రహ్మంగారి చరిత్ర

- ప్రతి ఉగాదికి క్రమం తప్పని కళాకారులు

**చిగురుమామిడి మార్చి 21 (ప్రజామంటలు):** ఇక్కడ ఏ చిన్న చిత్రం జరిగిన అది కాలజ్ఞానం వాక్యం బ్రహ్మంగారు చెప్పినట్టే జరుగుతుంది అని అంటారు. అలాంటి భూత భవిష్యత్తు కాలజ్ఞానం చెప్పిన కాలజ్ఞానకర్త వీర బ్రహ్మంగారి సంపూర్ణ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన సుందరగిరి గ్రామంలో గ్రామ కళాకారులచే ప్రదర్శించారు స్వామివారి అవతార విశేషాలు ఆయన మహిమలు గోవిందమ్మ బ్రహ్మం గారిలా కళ్యాణం తదితర మహత్తర సన్నివేశాలతో పాటు జీవ సమాధి వరకు రెండు రోజులు జరిగె ఈ కార్యక్రమంలో మొదటి రోజు సర్పంచ్ శ్రీమూర్తి రమేష్ కళాకారుల కమిటీ జిల్లా కోశాధికారి బోల్ల కొమురయ్య మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజకుమార్, తాళ్లపల్లి రాజయ్య, గందె కొమురయ్య, కక్కర్ల కృష్ణస్వామి, కక్కర్ల అంజయ్య, మెడబోయిన రాజయ్య, గందె రాజయ్య, మెడబోయిన రమేష్, పెసరు వెంకన్న, బుర్ర రాజయ్య ,గూళ్ల కొమురయ్య, కక్కర్ల మధు, శ్రీరామోజు మణికంఠ, కక్కర్ల వెంకటస్వామి, అంతడ్పుల వెంకటి, మొగిలి మల్లికార్జున్ రెడ్డి, కిషన్, రజినికాంత్, శ్రీనివాస్, రాములు, రవి బొందయ్య, వెంకటమల్లు, బాలయ్య, మల్లయ్య లతోపాటు మల్లాపూర్, మొగిలిపాలెం, రేకొండ, గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి, చిగురుమామిడి, నవాబుపేట, లంబాడిపల్లె తదితర





గ్రామాల కళాకారులు పాల్గొన్నారు.

## పలు ఉన్నత పాఠశాలను సందర్శించిన రాష్ట్ర విద్యా పరిశీలకులు

**జనగామ మార్చి 20 (ప్రజామంటలు):** 10వ తరగతి విద్యార్థులు రానున్న పది రోజులు అత్యంత కీలకంగా భావించి పదవ తరగతి పరీక్షలకు సంసిద్ధులు కావాలని రాష్ట్ర పరిశీలకులు రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ మతిన్ అహ్మద్ దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాలలోని పలు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.... ఈ సంవత్సరం కొత్తగా వచ్చిన ఆరు ప్రశ్నాపత్రాల పై పూర్తి స్థాయి అవగాహన పొందాలని సూచించారు. అంతేకాకుండా పంచ సూత్రాల ఆధారంగా ప్రతి విద్యార్థి పదవ తరగతిలో ఎక్కువ మార్కులను సాధించేలా వివిధ సబ్జెక్టులలో ఉదాహరిస్తూ మార్గ నిర్దేశం చేశారు. జవాబు పత్రం రాసే విధానము ప్రశ్నలను అవగాహన చేసుకునే తీరు ముఖ్యమని అన్నారు క్లిష్టమైన అంశాలను మైండ్ మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా సులభంగా అవగాహన చేసుకోవచ్చని ఉదాహరణలతో వివరించారు విద్యార్థులు చక్కగా ప్రతిస్పందించారు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ..... ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఆత్మస్థైర్యము నింపి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలోని ఎఫ్ఎల్ఎన్ నిర్వహణను కూడా



పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్పి లు నిమ్మ జయపాల్ రెడ్డి, కట్ల కోటి, సముద్రాల శేషు పాల్గొన్నారు.

## టాటా మ్యాజిక్ సంఘ గౌరవ అధ్యక్షులుగా పూదరి నర్సాగౌడ్

**మెట్ పల్లి మార్చి 21 (ప్రజామంటలు):** మెట్ పల్లి పట్టణం, మెట్ పల్లి రూరల్ , ఇబ్రహీంపట్నం మల్లాపూర్, ఆటో, జీబు, టాటా మ్యాజిక్ జేఏసీ సంఘం వారి ఆధ్వర్యంలో సంఘ గౌరవ



అధ్యక్షులుగా పూదారి నర్సాగౌడ్ ని ఎన్నుకోవడం జరిగింది. ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సంఘ సభ్యులు సన్మానం చేశారు. అనంతరం పూదారి నర్సాగౌడ్ మాట్లాడుతూ.... అసోసియేషన్ నుండి మెట్టుపల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం ఆటో జీబు టాటా మ్యాజిక్ సంఘం వారి అధ్యక్ష కార్యవర్గ సభ్యత్వ సభ్యులకు ఐడి కార్డ్ పంపిణీ జరిగింది. మన ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సహకారంతో యూనియన్ సమస్యలు పరిష్కరించుకుందామని సంఘాల వారు ఐడి ఇన్సూరెన్స్ మరియు ఇతరత్రా లోను ప్రభుత్వపరంగా సౌకర్యాలు ఎమ్మెల్యే సహకారంతో మనం నెరవేర్చుకుందామని మీ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధులాగా డ్రైవర్ కుటుంబ బంధు పథకం పెట్టి ప్రమాద బీమా పది లక్షల రూపాయలు మనోవర్తి ఇవ్వాలని డ్రైవర్ లకు పిఎఫ్ విధానాన్ని అమలు చేయాలని 50 సంవత్సరాలు దాటిన డ్రైవర్స్ కు 5000 రూపాయలు పెన్షన్ అందజేయాలని తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే ద్వారా త్వరలో వినతిపత్రం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక జేఏసీ సంఘ అధ్యక్షులు గుగులావత్ శివలాల్, ఉపాధ్యక్షుడు రంగు సంపత్ గౌడ్, క్యాషియర్ వి. వెంకటరమణ, ప్రవీణ్ అంజయ్య, గట్టయ్య, గంగాధర్, చిల్కయ్య, నవాబ్, కే. గంగాధర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# భగవద్గీత పఠన శిక్షణా తరగతులు

**జగిత్యాల మార్చి 21 (ప్రజామంటలు):** ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం గీతా భవన్ లో గీత ట్రస్ట్ ఆధ్వర్యంలో భగవద్గీత పఠణ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మెట్ పల్లి గీతా సత్సంగ్ అధ్యక్షులు చీలమంతుల చత్రపతి చే నిర్వహించబడుతున్న భగవద్గీత క్లాసులు 18-03-2023 నుండి 02-04-2023 వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. మంగళవారం నాలుగో రోజు ద్వితీయ అధ్యాయంలోని శ్లోకాలను శ్రోతలతో చదివించారు. నిజమైన శాంతి త్యాగం వల్లనే లభిస్తుందని, మనసులో రాగద్వేషాలు లేకుండా చూడాలని, కోరికలు వదిలిపెడితేనే శాంతి లభిస్తుందని, నాది అనుకున్నప్పుడే దుఃఖము ఉంటుందని, నాది కాదనుకుంటే దుఃఖం ఉండదని, చాలా చక్కగా హృదయాలకు హత్తుకునే విధంగా చెప్పారు. ఈనాటి కార్యక్రమంలో గీత సత్సంగ్ కార్యదర్శి పాంపట్టి రవీందర్, జీడిగి రాము, కోటగిరి చంద్రశేఖర్, గుడికందుల శ్రీనివాసు,తవుటు రామచంద్రం, గుడికందుల వెంకన్న, బూస



గంగారాం, చెట్ల మహేష్ ఎర్ర సత్తయ్య, బట్టు సుధాకర్, ఎన్నాకుల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎం త్రివేణిని నిలదీస్తున్న సర్పంచ్ ముస్కు నిశాంత్ రెడ్డి

- సభ్యుల గైర్హాజరుతో దర్శనమిస్తున్న కాలి కుర్చీలు

**గొల్లపల్లి మార్చి 21 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలంలో పనిచేస్తున్న పలువురు ప్రభుత్వ అధికారుల తీరుపై సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తున్న మండల సర్వసభ్య సమావేశానికి అధిక సంఖ్యలో సభ్యులు గైర్హాజర్ అవడంతో సమావేశ మందిరంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి ప్రజా సమస్యల పట్ల స్థానిక ప్రజాప్రతినిధులకు ఉన్న చిత్తశుద్ధిని మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యుల హాజరై పక్క నిదర్శనంగా నిలుస్తుందని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మంగళవారం గొల్లపల్లి ఎంపీపీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ నక్క శంకరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరుపై సమీక్ష చదివి వినిపిస్తున్న క్రమంలో స్థానిక సర్పంచ్ నిశాంత్ రెడ్డి గత సర్వసభ్య సమావేశంలో స్థానిక కేజీబీవీ పాఠశాల సమీపంలో వీధిలైట్లను అమర్చాలని సభా దృష్టికి తీసుకొస్తే జిపి డిడి కట్టాలని అప్పుడే వీలైతే ఏర్పాటు చేస్తామని



సెలవిచ్చారని అక్కడ వీధిలైట్లను ఎందుకు ఏర్పాటు చేస్తాలేరని నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కాంపల్లి హన్మండ్లు, ఎంపీడీవో నవీన్ కుమార్, తాసిల్దార్ దూలం మధు గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ నెక్స్ట్ జెన్‌లో ముందస్తు ఉగాది వేడుకలు

**హుజురాబాద్ మార్చి 21 (ప్రజామంటలు):** హుజురాబాద్ పట్టణంలోని విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ పాఠశాలలో మంగళవారం రోజున ముందస్తు ఉగాది వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొబ్బరికాయ కొట్టి వేడుకలను ప్రారంభించారు. తదనంతరం మాట్లాడుతూ ఉగాది అనేది ప్రకృతితో మమేకమై ఉంటుందని, వాతావరణ మార్పులను




అనుసరించి వచ్చే చిన్న చిన్న రోగాలకి ఉగాది సందర్భంగా తీసుకునే ఉగాది పచ్చడి అద్భుతమైన దివ్య ఔషధం అని తెలిపారు. అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్ మాట్లాడుతూ జనవరి ఒకటిన జరుపుకునేది ఆంగ్ల సంవత్సరాది అని, ఉగాది అనేది మన సంస్కృతి సంప్రదాయాలను అనుసరించి జరుపుకునే తెలుగు నూతన సంవత్సరాది అని, ఉగాది పచ్చడి అనేది షడ్రుచుల సమ్మేళనమనీ తెలిపారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ యాదవ్, డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి

**పట్టించుకోని ప్రజా ప్రతినిధులు**

**ఇబ్రహీంపట్నం మార్చి 21 (ప్రజామంటలు):** మండల పరిధిలోని కోమటి కొండాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి కుక్కలదాడిలో గొర్రె మేకలను కోల్పోయిన మల్లయ్య కుటుంబాన్ని నేడు పరామర్శించి వారికి ధైర్యాన్నిచ్చిన





అఖిల భారత యాదవ మహాసభ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు రెబ్బటి రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ.... గత నెలరోజుల నుండి రాష్ట్రం లోని ఆయాప్రాంతాలలో కుక్కల దాడిలో పిల్లలు,పెద్దలు,మహిళలు ఇబ్బందిపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు మనం చూసాము. అయినప్ప టికి అధికారులు, ప్రజాప్రతినిధుల్లో కదలిక రాకపోవడం అత్యంత శోచనీయం.సంఘటనలు చూస్తుంటే ఇది పజలకోసమైన ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఊర్లలో వీధికుక్కల బెడదను అధికారులు, ప్రజా ప్రతినిధులు తొలగించి ప్రజలకు భయం లేని జీవితాల్ని అందించాలని, అలాగే కోమటికొండాపూర్ లో కుక్కలదాడిలో 15 గొర్రె మేకలను కోల్పోయిన దానవేణి మల్లయ్య కుటుంబానికి అధికారులు, ప్రజాప్రతినిధులు నష్టపరిహారం కింద ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించి ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అశోక్ యాదవ్,మధు మరియు స్థానిక యాదవ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ

**హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్**

**శంకర్ పల్లి మార్చి 20 (ప్రజామంటలు):** హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం శంకర్ పల్లి మండల పరిధిలో ఉన్న కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 21 మంది



విద్యార్థులకు దాత కె. హైమవతి ఎఎఇ విద్యుత్ శాఖ సహకారంతో ఎగ్జామ్ కిట్స్ పంపిణీ చేసినట్లు ట్రస్టు అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. వచ్చేనెలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్ష జరుగుతునందున్న పిల్లలకి ఎంతగానో ఉపయోగప డుతుందని ఉద్దేశంతో ఎగ్జామ్ కిట్స్, ఎగ్జామ్ ప్యాడ్, జామెంట్రీ బాక్స్, లాంగ్ స్కేల్, పెన్ను, పెన్సిల్, షాప్నర్, ఎరేజర్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు మణికంఠ, మొగులయ్య, అనుపమ, రాజా, జ్యోతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

### హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన
## పోలీస్ కమిషనర్ ఎల్. సుబ్బారాయుడు

**హుజురాబాద్ మార్చి 21 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బారాయుడు ఐపిఎస్ హుజురాబాద్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా



సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల వివరాలను, రిజిస్టర్ లను అలాగే సంబంధిత రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పూల మొక్కను నాటి నీరు పోయడం జరిగింది. కార్యక్రమంలో సిపి గారి వెంట హుజరాబాద్ ఏసీపి కోట్ల వెంకటరెడ్డి, పట్టణ సీఐ బొల్లం రమేష్, రూరల్ సీఐ జనార్దన్ మరియు ఎస్సై రాజన్న పోలీస్ సిబ్బంది కలరు.

## ఆదర్శ పాఠశాల పాఠశాలలో "ప్రపంచ కవితా దినోత్సవం"

**గొల్లపల్లి మార్చి 21 (ప్రజామంటలు):** ప్రపంచ కవితా దినోత్సవం ఉగాది సందర్భంగా ఆదర్శ పాఠశాల గొల్లపల్లియందు పాఠశాల ఇంగ్లీష్ లాంగ్వేజ్ క్లబ్ ఆధ్వర్యంలో " విద్యార్థులచే కవి సమ్మేళనం నిర్వహించారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఇన్ ఇండియన్ ట్రెడిషన్" అనే ఇతివృత్తంతో విద్యార్థులచే "పోయెట్రీ మీట్ అప్ -2023" ఉత్సాహంగా నిర్వహించి ఇందులో సీనియర్ జూనియర్ కలిపి మొత్తం 75 మంది విద్యార్థులు వేర్వేరు అంశాలపై వారు రచించిన







కవితలను ఆంగ్లంలో వినిపించారు. అనంతరం విద్యార్థులను కండువాలతో సత్కారించారు. ప్రకృతి, దేశభక్తి, సంస్కృతి, సమాజం, సాంకేతికత, స్నేహ బంధం, మాతృత్వం.. లాంటి అంశాలపై తమ శీర్షికలతో సృజనాత్మకతను రంగరించిన కవితలతో మంత్రముగ్దుల్ని చేసారు. పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్ విద్యార్థుల అంగ్లంలో రచించిన కవితా శైలిని అభినందించారు. సమాజ హిత కవితలు రాస్తూ భవిష్యత్తుల మంచి రచయితలుగా పేరు గడించాలని అభిలషించారు. ఈ కార్యక్రమాన్ని ఇంగ్లీషు లాంగ్వేజ్ క్లబ్ కన్వీనర్ జి.వి. రమణ, కో కన్వీనర్లు జి. రాకేష్ , బి. ప్రవీణ్ కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తో పాటుగా వైస్ ప్రిన్సిపల్ కె. నగేష్ , భాషోపాధ్యాయులు రాజ శేఖర్, రాజేంధర్, హరిప్రియ, సంధ్య, అన్నపూర్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

## జడ్పీ చైర్మన్ సంపత్ రెడ్డిపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం

**జనగామ మార్చి 20 (ప్రజామంటలు):** జనగామ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి భూదందాకు తెరలేపాడని వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆ భూమికి సంబంధించిన జూలూరి శ్రీహరి సోదరి



రజిత, తనయుడు రోహిత్ మీడియాతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టర్ శివలింగయ్యకు వినతి పత్రం అందించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. జూలూరి శ్రీహరికి చెందిన ఒక ఎకరం 30 గుంటల భూమి అదే గ్రామానికి చెందిన భావన భాస్కర్ అనే వ్యక్తి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. ఈ ఇరు వర్గాలను జనగామ జిల్లా జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి పిలిపించి ఇద్దరిని న్యాయంగా మాట్లాడుకోమని చెప్పినందుకే అతనిపై లేనిపోని ఆరోపణలు సృష్టించారన్నారు. కావున అధికారులు స్పందించి అన్యాక్రాంతమైన తమ భూమిని తమకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డిసిపి సీతారాం కు వినతి పత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# 'అన్నీ మంచి శకునములే'..నేడు పాట విడుదల

దివంగత దర్శకుడు శోభన్ తనయుడు సంతోష్ శోభన్ హీరోగా ఇప్పటికే పలు సినిమాల్లో హీరోగా నటించాడు. అందులో ఒకటి రెండు మినహా ఎక్కువ శాతం ఫ్లాప్ అయ్యాయి. హీరోగా సంతోష్ శోభన్ కు స్టార్ హీరోల ప్రోత్సాహం,మద్దతు ఉండటంతో పాటు లక్ కలిసి వచ్చి ఫ్లాప్స్ పడుతున్నా కూడా వరుసగా సినిమా ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. తాజాగా మరో సినిమాతో సంతోష్ శోభన్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు. 'అన్నీ మంచి శకునములే' సినిమాతో సంతోష్ శోభన్ మే 18వ తారీకున ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఉగాది సందర్భంగా సినిమా నుంచి మొదటి పాటను విడుదల చేయబోతున్నారు. ఆ విషయాన్ని తెలియజేస్తూ ఒక వీడియోను షేర్ చేసారు. ఆ వీడియోలో సంతోష్ శోభన్ మామిడి చెట్టు ఎక్కి మామిడి కాయలు కోస్తూ ఉంటాడు. ఆ మామిడి కాయలను కోస్తూ ఉన్న సమయంలో ఒక్క మామిడి కాయ సరిగా లేదని అతడి సోదరి అనడం... మంచి మామిడి కాయకు కాస్త సమయం కావాలని.. ఇదుగో ఈ మామిడి కాయ బాగుందంటూ చూపిస్తూ తన సినిమాలపై తానే కౌంటర్ వేసుకున్నాడు. ఈ మధ్య కాలంలో అతడి నుండి వచ్చిన సినిమాలన్నీ కూడా బొక్క బోర్లా పడ్డాయి. దాంతో ఈ సారి సినిమాకు కాస్త సమయం తీసుకుని బెస్ట్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ సంతోష్ శోభన్ చెప్పాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమా తో కచ్చితంగా విజయాన్ని తన ఖాతాలో వేసుకుంటాననే



నమ్మకాన్ని ఈ వీడియో ద్వారా వ్యక్తం చేశాడు. ఫ్లాప్ సినిమాల హీరోకు ఈ సినిమా తో కచ్చితంగా మంచి విజయం నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. ఫ్లాప్ హీరో కు మంచి మామిడి కాయ దొరకడం ఖాయం అన్నట్లుగా ఆయన సన్నిహితులు కూడా నమ్మకంగా ఉన్నారు.

# బాహుబలి లెవల్లో సూర్య చిత్రం

### సెన్షన్ అవుతుందంటున్న నిర్మాత

రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి ప్రభావం సౌత్ ఇండస్ట్రీ మీద బలంగా ఉందని చెప్పాలి. ఈ మూవీ వేసిన దారిలో ప్రస్తుతం స్టార్ హీరోలు అందరూ కూడా పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నారు. అలాగే హై బడ్జెట్ మూవీస్ చేయడానికి నిర్మాతలు ధైర్యం చేస్తున్నారు. యూనివర్శల్ హైవోల్టేజ్ కథలని చెప్పడానికి దర్శకులు రెడీ అవుతున్నారు. ఈ కారణంగా టాలీవుడ్ నుంచి ఎక్కువ పాన్ ఇండియా సినిమాలు ఈ ఏడాది రాబోతున్నాయి. అలాగే కోలీవుడ్ నుంచి కూడా ఇప్పటికే పొన్నియన్ సెల్వన్ మూవీ వచ్చింది. తదుపరి దాని సీక్వెల్ కూడా రాబోతుంది. ఇక స్టార్ హీరో సూర్య కూడా పీరియాడికల్ వార్ యాక్షన్ తో శివ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. సూర్య 42వ సినిమాగా ఇది తెరకెక్కుతుంది. ఈ మూవీలో సూర్య యుద్ధవీరుడుగా కనిపిస్తాడు అని ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. అలాగే మూవీకి సంబందించిన లుక్స్ కూడా బయటకి వచ్చాయి. అతని క్యారెక్టరైజేషన్ చూసుకుంటే మగధీరలో రామ్ చరణ్ తరహాలో ఉంది. ఇక కథ కూడా పునర్జన్మ నేపధ్యంలోనే ఉండబోతుందనే టాక్ అయితే వినిపిస్తుంది. ఇదిలా ఉంటే ఈ మూవీ గురించి నిర్మాత ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. కోలీవుడ్ ఇండస్ట్రీలో సూర్య 42వ సినిమా ఒక బాహుబలి ఒక కేజీఎఫ్ లాంటిది. కచ్చితంగా ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది అని నిర్మాత జ్ఞాన్ వేల్ రాజా చెప్పడం విశేషం. అయితే ఈ సినిమా దర్శకుడు శివ ఇప్పటి వరకు చేసినవన్నీ రొటీన్ కమర్షియల్ చిత్రాలే కావడం విశేషం. ఇంతకుముందు అజిత్ తో వీరం వేదాళం అంటూ వరుసగా సినిమాలు చేసిన శివ రజనీకాంత్‌తో అన్నాత్తె సినిమా చేశాడు. అవి హిట్ అయిన కూడా గొప్పగా చెప్పుకునే



కథలు అయితే ఏవీ కావు. కేవలం కమర్షియల్ జోనర్ లోనే వచ్చిన హీరోయిక్ కథలే కావడం విశేషం. మరి ఇలాంటి దర్శకుడితో సూర్య 42వ సినిమాలో గొప్ప కథని అయితే ఆశించలేం అని కోలీవుడ్ ప్రేక్షకులు సైతం అంటున్నారు. అలాంటిది కేజీఎఫ్ బాహుబలితో పోల్చగలిగే సినిమా వస్తుందా అనే ప్రశ్న తలెత్తుతుంది.

# ఇద్దరు భామలతో స్టెప్పులేస్తున్న మహేశ్ బాబు

**శరవేగంగా త్రివిక్రమ్ సినిమా షూట్**

అలనాటి శోభన్ బాబు తరహాలో ఇప్పుడు మహేష్ బాబు ఇద్దరు భామలతో స్టెప్పులు వేయబోతున్నారు. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తో చేస్తున్న ఎంబి28 సినిమా షూటింగ్ చాలా ఫాస్ట్‌గా జరుపుకుంటోంది. ఎక్కడా ఎటువంటి హడావిడి లేకుండా షూటింగ్ సైలెంట్ గా చేసుకుంటూ వెళుతున్నారని తెలిసింది. ఆమధ్య మహేష్ బాబు, శ్రీ లీల మీద కొన్ని సన్నివేశాలు హైదరాబాద్ శివార్లలో వేసిన సెట్ లో తీసారని తెలిసింది. ఈ సన్నివేశాలు అన్నీ చాలా హైలైట్ గా వుంటాయని కూడా అంటున్నారు. ఇక్కడ తీసిన సన్నివేశాల్లో మహేష్ బాబు మళ్ళీ లుంగీ కట్టుకొని కనిపించే అవకాశం వుంది అని కూడా అంటున్నారు. ఇప్పుడు మహేష్ బాబు, పూజ హెగ్డే మీద రొమాన్స్ సన్నివేశాలు తీస్తున్నట్టుగా తెలిసింది. దీని కోసమని సారధి స్టూడియోలో ఒక సెట్ వేశారని, అందులో మహేష్, పూజ హెగ్డే అలాగే మరికొంతమంది నటులు పాల్గొనగా వారి మీద సన్నివేశాలు తీస్తున్నట్టుగా తెలిసింది. ఈ సినిమా ఇంతకు ముందు మహేష్ బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ సినిమాలతో పోలిస్తే కొంచెం తొందరగానే అవుతున్నట్టుగా చెప్తున్నారు. అలాగే త్రివిక్రమ్ కూడా ఈ సినిమాని తొందరగానే అనుకున్న తేదీకి పూర్తి చెయ్యాలని కూడా అనుకుంటున్నట్టుగా తెలిసింది. ఒకవేళ తొందరగా అయిపోతే ఈ సినిమా సమ్మర్ కి వచ్చేసే అవకాశాలు కూడా ఉన్నాయని అంటున్నారు. ఈ సినిమా త్రివిక్రమ్ తీసిన ఒక 'అతడు', ఒక 'అత్తగారింటికి దారేది'లా ఉంటుంది అని



చెప్తున్నారు. ఇంతవరకు సినిమా అయితే బాగానే వచ్చిందని, రానున్న రోజుల్లో ప్రాముఖ్యమైన సన్నివేశాలు చిత్రీకరిస్తారని, ఇందులో చాలామంది నటులు, ఇంచుమించు తమిళ, మలయాళం, కన్నడ పరిశ్రమలో నుండి నటులు ఉంటారని తెలుస్తోంది.

## గాయం నుంచి కోలుకున్న బిగ్‌బి

'ప్రాజెక్ట్ కే' సినిమా షూటింగ్ సమయంలో గాయపడిన బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ కోలుకున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా సోషల్ మీడియా వేదికగా తాజాగా తెలియజేశారు. అంతేకాకుండా.. తన ఆరోగ్యం గురించి ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే షూటింగ్‌లో తిరిగి పాల్గొననున్నట్లు అమితాబ్ చెప్పుకొచ్చారు. ఈ విషయం తెలిసిన ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'మీరు ఎప్పటిలా ఉత్సాహంగా ఉండాలి', 'గ్రేట్ న్యూస్', 'షెహన్‌షా వచ్చేశాడు' అంటూ ఆయన కామెంట్లు చేస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న 'ప్రాజెక్ట్ కే' మూవీ తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ తరుణంలో మార్చి మొదటి వారంలో మూవీ టీం ఓ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరించింది. ఈ సందర్భంలో అమితాబ్ కుడివైపు పక్కటెముకలకు దెబ్బ తగిలింది. దీంతో చిత్రబృందం ఆయన్ని వెంటనే హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ముంబయిలోని తన నివాసానికి వెళ్లిన ఆయన అప్పటి నుంచి విశ్రాంతి తీసుకుంటున్నారు.అలాగే.. తనకి జరిగిన ప్రమాదం గురించి అమితాబే స్వయంగా తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నట్లు అందులో తెలిపారు. ఏం జరిగినా బాధ పడకుండా దాన్ని అధిగమించేందుకు ప్రయత్నిస్తానని ఆయన ఆ బ్లాగ్‌లో చెప్పుకొచ్చారు.

## రామనవమి నుంచి ఆదిపురుష్ ప్రచారం

ప్రభాస్ లవర్స్ ఎంతగానో ఎదురు చూస్తున్న చిత్రాలలో 'ఆదిపురుష్' ఓం రౌత్ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో రామాయణ గాథ ఆధారంగా తెరకెక్కింది. ఈ చిత్రంపై ప్రభాస్‌తో పాటు ఆయన ఫ్యాన్స్‌కి భారీ ఆశలు ఉన్నాయి. ఎందుకంటే.. 'బాహుబలి' చిత్రాల తర్వాత వచ్చిన 'సాహో', 'రాధేశ్యామ్' అంతగా ఆకట్టుకోలేకపోయాయి. ఇందులో 'రాధేశ్యామ్' అయితే మరీ దారుణంగా ఎ÷-లాప్ అయ్యింది. అందుకే 'ఆదిపురుష్'తో హిట్ కొట్టాలని ప్రభాస్ కసిగా ఉన్నాడు. నిజానికి ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరిలో విడుదల చేయాలని మూవీ టీం భావించింది. దాని కోసం కొన్ని నెలల ముందే భారీ స్థాయిలో టీజర్‌ని విడుదల చేశారు. అయితే.. అందులోని వీఎఫ్ఎక్స్‌తోపాటు వానరులు, రావణుడి గెటప్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా రావణుడి గెటప్‌తో సైఫ్ అలీఖాన్ తాలిబన్‌లా ఉన్నాడని సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. దీంతో చిత్ర విడుదలపై వెనక్కి తగ్గిన మూవీ టీం దిద్దుబాటు చర్యలకు దిగింది. అనంతరం ఈ చిత్రాన్ని జూన్ 16న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం ప్రయత్నిస్తోంది. ఈ మూవీ ప్రమోషన్స్‌ని ప్రారంభించేందుకు ఓం రౌత్ అండ్ టీం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రామనవమి సందర్భంగా..ప్రభాస్ నేతృత్వంలోని ఓ బృందం దీనికి సంబంధించిన చర్యలు తీసుకుంటోంది. అలాగే.. ఎలాగైనా మార్చి 30న ప్రమోషన్స్‌ని ప్రారంభించేందుకు టీమ్ కట్టుబడి ఉందని చెప్పుకొచ్చారు.

## ఫోషన్ పక్వాడ్ సమావేశం

**ధర్మపురి మార్చి 21 (ప్రజామంటలు):** ధర్మపురి ప్రాజెక్ట్ కార్యాలయంలో పోషన్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా సూపర్ వైజర్స్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని టీచర్స్ అందరికి 15 రోజులు చేయవలసిన అవగాహన



కార్యక్రమాలు మరియు ఈ పోషన పక్షంలో భాగంగా చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి, పోషకాహారం, పరిస రాల పరిశుభ్రత, 1000 రోజుల ప్రాముఖ్యత గురించి, ఆరోగ్యవంతమైన పిల్లల కు పోటీల నిర్వహించాలని, పెరుగుదల పర్యవేక్షణ చేయాలని, ప్రతి ఇంటిలో కిచెన్ గార్డెన్ పెంచడం మరియు ఏ ఒక్కరిలో రక్తహీనత మరియు పోషకాహార లోపం లేని గ్రామముగా తీర్చిదిద్దాలని వారికి రోజు వారి కార్యక్రమాల గురించి వివరించడం జరిగినది. ఇందులో భాగంగా సూపర్ వైజర్స్, అంగన్వాడీ టీచర్స్ మరియు పోషన్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

### గ్రామ పంచాయితీకి తాళం వేసి
## నిరసన తెలిపిన చౌటపల్లి గ్రామ ప్రజలు

**హుస్నాబాద్ 21 మార్చి (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామాన్ని హుస్నాబాద్ మండలంలో కలపాలని



చౌటపల్లి ప్రజలు సర్పంచ్ గద్దల రమేశ్ ,ఉపసర్పంచ్ కోతకొండ పోచెట్టి బిఆర్ స్ గ్రామ శాఖ అధ్యక్షులు వెల్ది రంగా రావు రైతు సంఘం అధ్యక్షులు గంగదారి రాజయ్య లను గ్రామపంచాయతీ ఆఫీస్ రూమ్ లో వేసి తాళం వేసి 'అక్కన్నపేట వద్దు- హుస్నాబాద్ ముద్దు' అంటూ నినాదాలు చేస్తు గ్రామపంచాయతీ ముందు గ్రామ ప్రజలు నిరసన తెలిపారు. సోమవారం పలు గ్రామాలను హుస్నాబాద్ మండలంలో కలుపుతూ జీవో జారీ అయింది అందులో చౌటపల్లి గ్రామం లేకపోవడంతో గ్రామస్తులు తమ గ్రామాన్ని హుస్నాబాద్ లో కలపాలని కోరుతున్నారు.

## సోషల్ మీడియాలో మరణవార్త

### ఘాటుగా స్పందించిన నటుడు కోటా

### తనను ముందే చంపాలని చూస్తున్నారని ఆవేదన

సోషల్ మీడియాలో తాను చనిపోయినట్లు వస్తున్న వార్తలపై సీనియర్ నటుడు కోటా శ్రీనివాసరావు ఆందోళన చెందారు. తనను ముందే చంపేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.న కావాలని కొందరు ఇలాంటి వార్తలను ప్రచారం చేయడం బాధాకరమని ఆయన చెప్పుకొచ్చారు. తాను చాలా ఆరోగ్యంగా ఉన్నట్లు కోటా పేర్కొన్నారు. సోషల్ మీడియా తాన చనిపోయినట్లు వస్తున్న వార్తలపై కోటా తాజాగా స్పందించారు. ఉగాది పండుగ ఏర్పాట్లు చూసుకుంటున్న తనకు ఇలా వరుసగా చాలా ఫోన్ కాల్స్ రావడం ఆందోళన



కలిగించిందని చెప్పారు. అదే కొంచెం పెద్ద వాళ్లయితే నిజంగా గుండె ఆగి చనిపోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. ఆ వార్తల వల్ల తన ఇంటి వద్ద భద్రత కోసం ఏకంగా 10 మంది పోలీసులు వచ్చారని కోటా బాధను వ్యక్తం చేశారు. పాపులారిటీ, డబ్బు కావాలంటే వేరే మార్గాల్లో సంపాదించుకోవచ్చని, ఇలా పుకార్లను వ్యాప్తి చేయడం మంచి కాదని హెచ్చరించారు. మనుషుల జీవితాలతో ఆడుకోవడం.. దారుణమైన విషయమని చెప్పారు. ఇలాంటి చర్యలను ప్రజలు తీవ్రంగా ఖండించాలని తెలిపారు. ఇప్పుడే కాదు.. ఎప్పుడూ ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మొద్దని కోటా ప్రజలను, టాలీవుడ్ సినీ ప్రేక్షకులను కోరారు.

## 23నుంచి సైంధవ్ షూటింగ్‌కు రెడీ

వెంకటేష్, హిట్ దర్శకుడు శైలేష్ కొలను 'సైంధవ్' సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. మచ్చుకి ఈ సినిమా నుండి ఆమధ్య ఒక చిన్న టీజర్ లాంటిది విడుదల చేశారు. వెంకటేష్ పక్కన 'జెర్సీ' ఫేమ్ శ్రద్ధ శ్రీనాథ్ కథానాయికగా నటిస్తోంది.ఈ సినిమా తండ్రి,కూతుళ్ళ మధ్య నడిచే అనుబంధం మీద ఉంటుందని తెలుస్తోంది. అలాగే ఇందులో సైన్స్ ఫిక్షన్ కూడా ఉండొచ్చని కూడా తెలిసింది. దర్శకుడు శైలేష్ కొలను ఇంతకు ముందు 'హిట్' సిరీస్ చేసాడు. మొదటిది 'హిట్' విశ్వక్ సేన్ తో, తరువాత 'హిట్ 2' అడివి శేష్ తో చేసాడు. రెండు సినిమాలు విజయాన్ని సాధించాయి. ఈ 'సైంధవ్' సినిమా షూటింగ్ ఈనెల 23 నుండి హైదరాబాద్ లో ప్రారంభం అవుతుందని తెలుస్తోంది. వెంకటేశ్ నటించిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్ లో శృంగారం శృతిమించిందని చాలామంది అంటున్నారు. రాజకీయనాయకులు, ఇతర సెలబ్రిటీస్ ఈ వెబ్ సిరీస్ ని బాగా విమర్శించటమే కాకుండా, వెబ్ సిరీస్ ల మీద కూడా సెన్సార్ ఉండాలి అని అంటున్నారు. ఇందులో వెంకటేష్ ఒక వైవిధ్యమయిన పాత్ర చేసినప్పటికీ, అతని ఇమేజ్ బాగా దెబ్బతింది. వెండి తెర మీద వెంకటేష్ ని ఎప్పుడూ, ఎన్నడూ ఆలా చూడాలని ప్రేక్షకులు ఇలా ఒక కొత్త అవతారంలో, అదీ కాకుండా అతని మాటలు ఈ వెబ్ సిరీస్ లో కొంచెం వలన, జీర్ణించుకోలేక పోతున్నారు. ఇదేంటి వెంకటేష్ ఇలా చేస్తున్నాడు అని ముఖ్యంగా మహిళా ప్రేక్షకులు బాగా డిసప్పోయింట్ అయ్యారు అని అంటున్నారు. ఇప్పుడు ఈ 'సైంధవ్' సినిమాతో వెంకటెష్ పోయిన ఇమేజ్ వస్తుందా అని ఒక చర్చ నడుస్తోంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com